## స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**సంగారెడ్డిబ్యూరో, డిసెంబరు 9,ప్రభాతవార్త :** సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఓల్డ్ డిఆర్‌డిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎన్నికల నియమావళి ప్రకారం పరిశీలన నిర్వహించాల్సి ఉంటుంది. స్ట్రాంగ్‌రూమ్ సమీపంలోని భద్రతా ఏర్పాట్లు, బందోబస్తును, సీసీ కెమెరాల పనితీరు, విద్యుత్ సౌకర్యం క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బందికి తగిన సూచనలు చేశారు.సీసీ కెమెరాల పనిచేసే విధానాన్ని పరిశీలించి, నిరంతరం పనిచేస్తున్నాయా లేదా, విద్యుత్ సరఫరా నిరంతరంగా కొనసాగు తుందా అన్నది పరిశీలించి, అవరోధాలేవైనా ఉంటే వెంటనే నివారించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.విధి నిర్వహణలో వున్న సిబ్బందికి పటిష్టమైన భద్రతా జాగ్రత్తలు పాటించాలంటూ కలెక్టర్ సూచనలు చేశారు. రిజిస్టర్ లను తనిఖీ చేసి, తగిన సంతకాలు చేశారు. స్ట్రాంగ్ రూమ్ లను నిరంతరంభద్రంగాఉంచేందుకు తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్త తీసుకోవాలని అన్నారు.ఎటువంటి అవాంఛనీయ పరిస్థితులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్.డి.ఓ రవీందర్ రెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఆంథోని,సిబ్బంది పాల్గొన్నారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

## వార్త

## 108 అంబులెన్స్‌లలో ఉద్యోగావకాశం

**గజ్వేల్, డిసెంబరు 9 (ప్రభాతవార్త):** ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న 108 అంబులెన్స్ వాహనాల్లో పనిచేయుటకు మెడికల్ టెక్నిషియన్ పోస్టులు, ఫైలెట్ (డ్రైవర్) ఉద్యోగాల కొరకు అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులను కోరుతున్నట్లు సిద్దిపేట జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జనార్దన్, జిల్లా కో-ఆర్డినేటర్ హరికృష్ణలు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి అదేరోజు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈఎంటికి కావాల్సిన అర్హతలు బీఎస్సీ నర్సింగ్, బిఎస్సీ లైఫ్ సైన్స్, జిఎన్ఎం, ఎంఎల్‌టి, డిఎంఎల్‌టి, బిఫార్మసీ, విద్యా అర్హతలు, వయస్సు 20 నుండి 35 సంవత్సరాల వరకు ఉండవలెనని అన్నారు. ఫైలెట్ ఉద్యోగాల కొరకు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండి, ట్రాన్స్‌పోర్ట్ లైసెన్స్‌తో పాటు బ్యాడ్జి నెంబర్ కలిగి ఉండాలన్నారు. వయస్సు 20 నుండి 35 మధ్య ఉన్న అభ్యర్థులు డిసెంబరు 11 బుధవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు సిద్దిపేట పట్టణంలోని బురుజు దగ్గర గల పాత ఎంసిహెచ్ ఆసుపత్రిలోని స్వచ్ఛ బడి హాల్‌లో నిర్వహించబడే ఇంటర్వ్యూకు హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9100799162, 9100799265 నెంబర్లలో సంప్రదించాలన్నారు.



సింగూరు ప్రాజెక్టును కలెక్టర్‌తో కలసి పరిశీలిస్తున్న మంత్రి దామోదర్

## సింగూరు ప్రాజెక్టును పరిశీలించిన మంత్రి

**పుల్‌కల్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను, సింగూరు ప్రాజెక్టును వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి దామోదర్ పరిశీలించారు. మోడల్ స్కూల్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి పరిశీలించారు. వంట గదిలో ఉన్న ఆహార సామాగ్రిని అధికారుల తో కలసి మంత్రి పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అం దించాలని అధికారులకు సూచించారు. నాణ్యమైన భోజనం అందించే విషయంలో తప్పులు చోటుచేసుకుంటే కఠిన చర్యలు తప్పవని బాధ్యు లకు మంత్రి హెచ్చరించారు. చలికాలం అయినందున విద్యార్థులకు సరిపడా దుప్పట్లు అందచేయాలని సూచించారు. వసతి గృహం కిటికీలు పగిలినవి ఉంటే వెంటనే బాగు చేయించాలన్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని అధికారులకు సూచించారు.

**పర్యాటక ప్రాంతంగా సింగూరు...**

సింగూరు ప్రాజెక్టును ఆదివారం మంత్రి దామోదర్ సందర్శించారు. సింగూరును పర్యాటక ప్రాంతంఆ తీర్చిదిద్దుతామని మంత్రి పేర్కొ న్నారు. సింగూరును పర్యాటక ప్రాంతంగా మార్చితే ఈ ప్రాంత ప్రజలకు ఆహ్లాదంతో పాటు పర్యాటకులతో ఉపాధి పొందుతారన్నారు. మంత్రి వెంట ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**సంగారెడ్డి బ్యూరో, డిసెంబరు 9, ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్ర మానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమ వారం నిర్వహించిన ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమాంలో 74 ఫిర్యాదులు అందాయన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు సమస్యలను అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, డిఆర్ఓ పద్మజరాణి, ఆర్డీఓ రవీందర్‌రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. దివ్యాంగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి

## నేడు దివ్యాంగుల కోసం ప్రత్యేక ప్రజావాణి

### -మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**మెదక్ రూరల్, డిసెంబర్ 9 ప్రభాతవార్త:** జిల్లాలో ఉన్న దివ్యాంగు లకు ప్రతి నెల రెండవ మంగళవారం ప్రత్యేక ప్రజావాణి ఏర్పాటు చేసి వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సమీకృత కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ దివ్యాంగుల ప్రత్యేక ప్రజావాణిపై ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం రోజు దివ్యాంగుల కొరకు ప్రత్యేక ప్రజావాణి ఏర్పాటు చేస్తామని ఇచ్చిన మాటపై కట్టుబడి ఉండి వెంటనే ప్రజావాణిపై అధికారులతో సంప్రదించి ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ప్రతి నెల రెండో మంగళ వారం ప్రజావాణి ఏర్పాటు చేయాలని సంబంధిత గ్రామీణ అభివృద్ధి, జిల్లా స్త్రీ శిశు, వయోవృద్ధుల సంక్షేమ శాఖల సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నేడు కలెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేక ప్రజావాణి ఉంటుందన్నారు. సంబంధిత సంక్షేమ శాఖ అధికారి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ దివ్యాంగుల ప్రత్యేక ప్రజావాణికి జిల్లా స్త్రీ శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా గ్రామీణ అభి వృద్ధి, ఎల్‌డీఎం, ఆర్టీసీ డీఎం, మెప్మా పీడీ సంబంధిత శాఖల అధి కారులు హాజరుకావాలని కలెక్టర్ ఈ సందర్భంగా ఆదేశించారు.

## సర్వేకు వచ్చే అధికారులకు సహకరించాలి : మున్సిపల్ చైర్మన్

**గజ్వేల్ టౌన్, డిసెంబరు 9 (ప్రభాతవార్త):** ఇందిరమ్మ గృహాల సర్వే కు వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, కమిషనర్ గోల్కొండ నర్సయ్య కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాపాలనలోని ఇందిరమ్మ గృహాలు రూ.5 లక్షల సర్వేను వార్డు ఆఫీసర్లకు ఇచ్చిన వివరాల సర్వేను త్వరగా పూర్తిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జకియొద్దీన్, పాలకవర్గ సభ్యులు, వార్డు ఆఫీసర్లు, ఇంచార్జ్‌లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను అరెస్టుచేయడం సిగ్గుచేటు

### మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**సిర్గాపూర్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లను అసెంబ్లిలోకి వెళ్లకుండా అక్రమ అరెస్టు చేయడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి మండిపడ్డారు. సిర్గాపూర్‌లో సోమ వారం బిఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని మధ్యతరహా ప్రాజెక్టు నల్లవాగు నీటిని విడుదల చేసే క్రమం లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి సాగునీరు చివరి ఆయకట్టు వరకు వెళ్తాయా అని ఉన్నతాధికారులను అడిగితెలుసుకున్నారంటే ఎమ్మెల్యేకు ప్రాజెక్టుపై ఎంతమేర అవగాహన ఉందో తెలుస్తోందని విచారం వ్యక్తం చేశారు. ప్రాజెక్టులో నీటి మొత్తం పూర్తిగాఉన్న నీటిని మొత్తం చివరివరకు వదల కుండా 4089 ఎకరాలకు మాత్రమే నీటిని విడుదల చేయడం సిగ్గుచేట న్నారు. రైతులను మోసం చేసేందుకు ఎమ్మెల్యే రైతుల చెవుల్లో బీడీలు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతన్నలపై ఎమ్మెల్యేకు అభిమానం ఉంటే బసవేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను ప్రారం భించేలా ముఖ్యమంత్రిని ఒప్పించాలని హితువు పలికారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిగడుస్తున్నా నియోజకవర్గంలో ఇరిగేషన్‌కు ఒక్క రూపాయి కూడా మంజూరు చేయించలేదని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి సభ్యులు లక్ష్మీబాయి రవీందర్ నాయక్, మాజీ ఎంపిటిసి సభ్యులు ముజామిల్ శ్రీనివాస్‌పాటిల్, పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్ సేట్ మాజీ ఉప సర్పంచ్ సిద్దు, నియోజకవర్గ అధ్యక్షులు అంజాగౌడ్, కురుమ సంఘం తాలుకా ఉపాధ్యక్షులు మల్గొండ, నాయకులు సురేష్, జ్ఞానేశ్వర్ కురుమ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

# గ్రూప్-2 పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

### మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబరు 9 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపి ఎస్‌సి) ఆధ్వర్యంలో డిసెంబర్ 15, 16వ తేదీల లో జరిగే గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పరిధిలో గ్రూప్ -2 పరీక్షల నిర్వహణకు సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్-2 పరీక్షను ప్రశాంతంగా, సమర్థవంతంగా నిర్వహించటానికి అందరూ కో ఆర్డినేషన్‌తో పనిచేయాలని, పరీక్ష నిర్వహణకు సంబంధిత శాఖ అధికారులకు టీజీపీఎస్సీ నిబం ధనల మేరకు ఏర్పాట్లు చేయవలసిందిగా ఆదేశిం చారు. జిల్లాలో 16 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. మెదక్-11, నర్సాపూర్ -3, తూప్రాన్-2 సెంటర్‌లు ఉంటాయన్నారు. 5,855 విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలో నిరంతరం కరెంట్, నీటి వసతి, సీసీ కెమెరాలు, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసేలా చూడాలన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. నవంబర్ 15, 16వ తేదీలలో పరీక్షను ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటలవరకు, 3.00 నుండి 5.30 గంటల వరకు పరీక్ష నిర్వహించబడుతుం దని, మధ్యాహ్నం నిర్వహించే పరీక్ష సాయంత్రం 5:30 వరకు ఉంటుందని అన్నారు. 15వ తేదీన నిర్వహించే గ్రూప్-2 పరీక్ష జనరల్ స్టడీస్, జన రల్ ఎబిలిటీస్ పేపర్-1 ఉంటుందని, మధ్యా హ్నం హిస్టరీ, పొలిటీ, సొసైటీ పేపర్ -2 పరీక్ష రాయాల్సి ఉంటుందని, 16వ తేదీన ఎకనామి, డెవలప్మెంట్ పేపర్-3, మధ్యాహ్నం తెలంగాణ మూమెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ అనే అంశంపై పేపర్-4 పరీక్ష రాయాల్సి ఉంటుందన్నారు. అం దుకు ప్రతి పరీక్ష కేంద్రాలలో లైటింగ్ ఉండే విధం గా ఏర్పాటు చేయాలని, కావలసిన ఏర్పాట్లను చీఫ్ సూపరింటిండెంట్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్ష రాసే అభ్యర్థులు ఒక రోజు ముందుగా పరీక్ష కేంద్రాన్నిచూసుకోవాలని, ప్రతి అభ్యర్థి 8 గంటలకల్లా పరీక్ష కేంద్రం చేరుకునే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని, ఆర్టీసీ ఆధ్వర్యం లో ప్రత్యేకించి బస్సులు ఆయా రూట్‌లలో ప్రత్యే కించి పరీక్ష రాసే అభ్యర్థుల కోసం ఆర్టీసీ బస్సు లను సెంటర్‌కు చేరే విధంగా చూడాలని పేర్కొ న్నారు. మండలాలలో గ్రూప్-2 పరీక్ష రాసే అభ్యర్థు లకు తెలియజేసే విధంగా ఆయా మండల తాహసీ ల్దార్‌లు గ్రామపంచాయతీ లెవల్‌లో టామ్ టామ్ నిర్వహించి గ్రూప్-2 పరీక్ష రాసే అభ్యర్థులకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని, ఆయా బస్సులను ఉపయోగించి సమయానికంటే ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సిందిగా అభ్యర్థులకు సూచించారు. జిల్లా నుండి గ్రూప్-2 పరీక్ష రాసేందుకు 5,855 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని, అందుకుగాను 16 సెంటర్ లలో ఏర్పాట్లు చేయడం జరిగిందని, 16 మంది చీఫ్ సూపరింటిండెంట్‌లు, 58 మంది పరిశీల కులు, 44 మంది బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, ఐదుగురు రూట్ ఆఫీసర్లు, 16 మంది డిపార్ట్మెం టల్ ఆఫీసర్లు, 5 మంది ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించడం జరిగిందని అదనపు కలెక్టర్ అన్నారు. సమావేశంలో కలెక్టరేట్ ఏవో యూనస్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్‌డీవో పీడీ శ్రీనివాస రావు, సంబంధిత ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర రైల్వే మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎంపిలు

## చిన్నకోడూరులో రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాలి

### కేంద్ర రైల్వే మంత్రికి వినతి పత్రం అందజేసిన బిఆర్ఎస్ ఎంపిలు

**చిన్నకోడూరు, డిసెంబరు 9, ప్రభాతవార్త :** కొత్తపల్లి మనోహరబాద్ రైల్వే లైన్‌లో భాగంగా సిద్దిపేట నుంచి కొత్తపల్లికి వెళ్లే రైల్వే మార్గంలో ఉన్న చిన్న కోడూరులో రైల్వేస్టేషన్ ఏర్పాటుచేయాలని బిఆర్ఎస్ పార్టీ రాజ్యసభ సభ్యులు కె.ఆర్.సురేష్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, దామోదర్‌రావు సోమవారం ఢిల్లీలో కేంద్ర రైల్వేమంత్రి అశ్విన్‌వైష్ణవ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం సిద్దిపేటవరకు రైలు సేవలు నడుస్తున్నాయని..సిద్దిపేట నుంచి కొత్తపల్లి వైపు ముమ్మరంగా పనులు సాగుతున్నాయని..ఈ నేపథ్యంలో చిన్నకోడూరులో రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు సూచన మేరకు ఎంపిలు వినతి పత్రం అందజేశారు. హరీష్‌రావుకు చిన్నకోడూరులో రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రజలు వివరించగా ఆయన స్పందించి ఎంపిలకు విన్నవించడంతో వారు కేంద్ర రైల్వే మంత్రికి వినతి పత్రం అందజేశారు. చిన్నకోడూరులో రైల్వే స్టేషన్ ఏర్పాటుకు కేంద్ర రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపిలు తెలిపారు.ఈసందర్భంగా ఎంపిలకు హరీష్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా ప్రజాపాలన విజయోత్సవాలు

### నర్సాపూర్‌లో భారీ ర్యాలీ.. సోనియా గాంధీ జన్మదిన వేడుకలు



భారీ ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**నర్సాపూర్, డిసెంబర్ 9 ప్రభాతవార్త :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజాపాలన విజ యోత్సవాల్లో భాగంగా సోమవారం నర్సాపూర్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన ఏడాది పూర్తిచేసుకుని ప్రజల హామీలు నెరవేర్చిన నేపథ్యంలో నర్సాపూర్‌లోని క్యాంపు కార్యాలయం నుండి భారీ ర్యాలీ ప్రారంభమై చౌరస్తావరకు సాగింది. అక్కడి నుండి బస్టాండ్ రోడ్డు వరకు వెళ్లి బస్టాండ్ ఎదురుగా తెలంగాణ ప్రధాత, కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ 78వ జన్మదిన వేడుకలు ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియో జకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జిల్లా గ్రంథా లయాల సంస్థ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షు రాలు సుజాత, ప్రజాపాలన విజయోత్సవాల సమన్వయకర్త జూలకంటి ఆంజనేయులు, నాయకులు సోమన్నగారి రవీందర్ రెడ్డి, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీని వాస్ గుప్తా, మండల కాంగ్రెస్ అధ్యక్షులు మల్లేశం, పట్టణ కాంగ్రెస్ అధ్య క్షుడు ఆంజనేయులుగౌడ్, రుస్తుంపేట అశోక్, రెడ్డిపల్లి అశోక్ గౌడ్, నాయకులు ఉదయ్, రాధాకృష్ణ గౌడ్,రశీద్, అల్తాఫ్, ఎద్దు మలేష్ యాదవ్, శ్రీశైలం యాదవ్, రామా గౌడ్, నరేష్, దుర్గేష్, ఎన్ ఎస్ యుఐ నాయకుడు మణిదీప్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



తడిచెత్త, పొడిచెత్తపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

### -మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

**గజ్వేల్ టౌన్, డిసెంబరు 9 (ప్రభాతవార్త):** తడిచెత్త, పొడిచెత్త, హానికరమైన చెత్తపై సోమవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 8 వార్డులో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, కమిషనర్ గోల్కొండ నర్సయ్యలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రత కోసం ప్రతి వారానికి రెండు గంటల పాటు శ్రమదానం చేయాలన్నారు. చెత్త సేకరణలో భాగంగా ప్రతి ఇంటికి తిరుగుతూ తడిచెత్త, పొడిచెత్త, హానికరమైన చెత్తపై వార్డు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అలాగే మున్సిపల్ ప్రజలకు తడిచెత్త, పొడిచెత్త, హానికరమైన చెత్త వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. తడి, పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ స్వచ్ఛ వాహనానికి అందించాలన్నారు. తడి, పొడి, హానికర చెత్త సేకరణలో భాగస్వాములై స్వచ్ఛ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌కు కృషి చేయాలన్నారు. చెత్తను రోడ్డుపై, మురికి కాల్వల్లో, ఖాళీ ప్రదేశాల్లో వేయరాదన్నారు. అలా వేసిన వారిని గుర్తించి జరిమానా విధించడం జరుగుతుందన్నారు. మున్సిపాలిటీని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామన్నారు. అలాగే రోజుకొక వార్డులో ఈ అవగాహన కార్యక్రమం ఉంటుందని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీపై కూడా అవగాహన కల్పిస్తామన్నారు. అండర్ డ్రైనేజీలో కూడా ప్లాస్టిక్, పేపర్లు, ఇతర వస్తువులు వేయకూడదని తెలిపారు. అనంతరం తడి, పొడి, హానికర చెత్తను వేరుచేసిన వారిని మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌లు శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జకియొద్దీన్, కౌన్సిలర్ శ్రీనివాస్, వార్డు అధ్యక్షుడు, వార్డు ప్రజలు, ఆర్‌పిలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జగదేవ్‌పూర్ బూత్ అధ్యక్షుడిగా బింగి శేఖర్

**జగదేవ్‌పూర్, డిసెంబరు 9 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలోని 319వ బూత్ అధ్యక్షుడిగా బింగి శేఖర్‌ను బిజెపి మండలఅధ్యక్షుడు దాసరి ఐలయ్య యాదవ్ నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా సోమవారం మండలకేంద్రంలో బిజెపి బూత్ అధ్యక్షునిగా శేఖర్‌ను నియమించడం జరిగిందని, రానున్న స్థానిక ఎన్నికల్లో గ్రామ గ్రామాన బిజెపి జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల నాయకులు కందుల బాలరాజు, అజిత్‌రెడ్డి, చంద స్వామి, జంబుల దేశాయ్‌రెడ్డి, బిజెపి యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బూత్ అధ్యక్షునికి నియామకపత్రం అందజేస్తున్న ఐలయ్యయాదవ్



క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఓ యాదగిరి, కమిటీ సభ్యులు

## సిఎం కప్ క్రీడలకు మైదానాల పరిశీలన

**జగదేవ్‌పూర్, డిసెంబరు 9 (ప్రభాతవార్త):** సిఎం కప్-2024 మండల స్థాయి క్రీడా పోటీలు మండలకేంద్రంలో త్వరలో నిర్వహించనున్నందున సోమవారం జగదేవ్‌పూర్‌లోని ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీల ఏర్పాట్లకు మైదానాన్ని ఎంపిడిఓ బి.యాదగిరి కమిటీ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 11, 12 తేదీల్లో సిఎం క్రీడా కప్ 2024 మండల స్థాయి పోటీలను నిర్వహించనున్నామని, క్రీడల్లో పాల్గొనేందుకు వివిధ గ్రామాల్లోని యువత ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం 2 గంటలలోపు జగదేవ్‌పూర్ బాలుర ఉన్నత పాఠశాలలో పిడి ఎల్లేశ్వర్ రావుకు వివరాలు అందజేయాలని, వివరాల కొరకు 9989170936 నెంబర్‌లో సంప్రదించాలన్నారు. 11వ తేదీన మహిళలకు, 12వ తేదీన పురుషులకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహిస్తామని, ఈ క్రీడా పోటీలకు ఉత్సాహవంతులైన యువతీ, యువకులు, బాల బాలికలు తమ వివరాలను పంచాయతీ కార్యదర్శుల వద్ద నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పిడితో పాటు ఎస్ఐ చంద్రమోహన్, ఎంఈఓ మాధవరెడ్డి, ఎంపిఓ ఖాజా మొయినొద్దీన్, పిజిహెచ్‌ఎం సైదులు, జగదేవ్‌పూర్ పంచా యతీ కార్యదర్శి రాంరెడ్డి, వివిధ గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

## రెండు కార్లు ఢీ: ఒకరి మృతి

**నర్సాపూర్, డిసెంబరు 9, ప్రభాతవార్త :** రెండు కార్లు ఎదురెదురుగా వచ్చి ఢీకొనగా ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన నర్సాపూర్ మెదక్ జాతీయ రహదారిలోని పెద్దచింతకుంట శివారులోగల జల హనుమాన్ ఆలయం సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ బి.లింగం కథనం ప్రకారం... వనపర్తి జిల్లా వనపర్తి పట్టణానికి చెందిన డెంగి శ్రీకాంత్ కుమార్(30) ప్రైవేటు కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడని తెలిపారు.. కాగా ఆదివారం స్నేహితులు శివరాములు, యాదగిరి, శివకృష్ణ, రాఘవేంద్ర రావుతో కలిసి ఈ నెల 8న వనపర్తి నుండి మెదక్ జిల్లాలోని ఏడుపాయల వనదుర్గ మాత దర్శనానికి వచ్చారు. ఈ మేరకు వారు వనదుర్గమాతను దర్శించుకుని తిరిగి అదే రాత్రి షిఫ్ట్‌కారులో వస్తుండగా రాత్రి 8 గంటల సమయంలో నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట శివారులోని జల హను మాన్ ఆలయ వద్దకు రాగానే హైదరాబాద్ నుండి మెదక్ వైపు వెళ్తున్న ఇన్నోవాకారు డ్రైవర్ హుస్సేన్ అతివేగంగా నడుపుతూ ఎదురుగా వస్తున్న షిఫ్ట్ కార్లు ఢీకొట్టిందని తెలిపారు. కారులోఉన్న శ్రీకాంత్‌కుమార్(30) అక్కడి కక్కడే మృతి చెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. గాయాలైన వీరిని నర్సాపూర్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో కొందరిని మిగతా వారిని మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మృతుడు శ్రీకాంత్‌కుమార్ భార్య భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.లింగం తెలిపారు

## మహిళలపై దాడి ప్రభుత్వ దాడే : ఎమ్మెల్యే

**నర్సాపూర్, డిసెంబరు 9, ప్రభాతవార్త :** మహిళలపై పోలీసులు దాడి చేయడం ప్రభుత్వం చేసిన దాడియేనని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఆశ వర్కర్లు డిమాండ్ల సాధనకు ధర్నా చేస్తుంటే పోలీసులచే దాడి చేయించడం దారుణమన్నారు. మహిళలపై మగపోలీసులతో దాడి చేయడమే కాకుండా అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. ఇప్పటికైనా దాడి లో స్పృహకోల్పోయిన ఆశానాయకురాలు సంతోషిని వెంటనే మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. కాంగ్రెస్‌ప్రభుత్వం ఆశావర్కర్‌లకు ఇచ్చిన హామీ లను అమలుచేయాలని ఆమె డిమాండ్‌చేశారు. అంతేగాక మహిళలను కొట్టిన పోలీసుల పై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి డిమాండ్ చేశారు.

## ఇసుక అక్రమ రవాణా

### చోద్యం చూస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు

**హత్నూర డిసెంబరు 9, ప్రభాతవార్త :** వడ్డించేవాడు మనవాడైతే, పంక్తి లో ఎక్కడ కూర్చున్న పర్వాలేదు అన్నచందంగా మారింది హత్నూర రెవెన్యూ అధికారుల పనితీరు. ఇసుక, మట్టి, కలప వంటి వాటి అక్రమ రవాణను నివారించడానికి వాల్టా చట్టాన్ని తీసుకొచ్చినా, వాటిని అసరగా చేసుకొని, కొందరు అధికారులు స్వప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తుండటంతో హత్నూర మండలంలో అక్రమ ఇసుక రవాణా యదేచ్చగా సాగుతోంది.కృత్రిమ ఇసుక తయారీ నడుస్తున్న విషయం బహిరంగ రహస్యం అయినా,స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ఇసుక అక్రమ రవాణా యదేచ్చగా సాగుతుందని గుండ్లమాచునూర్ గ్రామానికి చెందిన పలవురు ఆరోపిస్తున్నారు.హత్నూర మండలం గుండ్లమాచునూర్ గ్రామం పరిధిలో కృత్రిమ ఇసుక తయారి,రవాణ జరుగుతున్నా సంబందిత అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.రెవెన్యూశాఖకు సంబందించిన అధికారి ఒకరు మూడుపులు తీసుకుంటూ,చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.గుండ్లమాచునూర్ గ్రామం పరిధి లో కృత్రిమ ఇసుక తయారి,రవాణా జరుగుతున్న ఎందుకు చర్యలు తీసుకొవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై హత్నూర ఇన్ చార్జి తహసీల్దార్ దావుద్ ఆహ్మద్‌ను వివరణ కోరగా ఇసుక రవాణ విషయం తనదృష్టికి రాలే దని,ఆర్‌ఐతో పరిశీలన జరిపించి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ విషయమై ఎస్ఐ సుభాష్‌ను ఫోన్లో సంప్రదించగా ఆయన స్పందించలేదు.



గుండ్లమాచునూర్ పరిధిలో ఇసుక తీయడానికి తీసిన గుంత

# కాంగ్రెస్‌లో పెరుగుతున్న గ్రూపులు.. మారుతున్న రాజకీయాలు

### -పోటాపోటీగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు.. అధిష్టానం పట్టించుకోవాలంటున్న పలువురు నేతలు

**గజ్వేల్, డిసెంబరు 9 (ప్రభాతవార్త):** గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ లో రోజురోజుకు గ్రూపు రాజకీయాలు పెరుగుతూ వస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం పూర్తవుతున్నా గ్రూపు రాజకీ యాలవల్ల అధికారం వచ్చిందనే సంతోషం లేకుండా కార్యకర్తల్లో అయోమయం నెలకొంది. గతంలో మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యం లో కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తలు పెద్దఎత్తున పనిచేశారు. ఈ క్రమంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో నర్సారెడ్డి నాయకత్వ బలం పెరిగింది. అది చూడలేక గజ్వేల్‌లో గ్రూపు రాజకీయాలను కొందరు నేతలు ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా పోటా పోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 15 రోజుల క్రితం కోకోకోలా పరిశ్రమను ప్రారం భించే సమయంలో తూంకుంట నర్సారెడ్డి వర్గీ యులు, బండారు శ్రీకాంత్‌రావు వర్గీయులు పెద్ద ఎత్తున ఎవరికివారే నినాదాలు చేసుకుంటూ ఘర్షణ వాతావరణం కల్పించారు. దీంతో పోలీసులు తూం కుంట నర్సారెడ్డిని అడ్డుకోవడంతో మరింత ఉద్రి క్తత నెలకొంది. మొదటగా బండారు శ్రీకాంత్ రావు ను పోలీసులు అనుమతించడంతో గజ్వేల్ నియో జకవర్గంలో మంచి పట్టున్న నేత, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిని అడ్డుకోవడం ఏమిటని ఆయన వర్గీ యులు పెద్దఎత్తున గొడవ చేశారు. ఈ విషయం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా నర్సారెడ్డిని లోనికి అనుమతించాలని, ఎందుకు ఇలా చేస్తున్నారని ఉన్నతాధికారిని మందలించి నట్లు సమాచారం. అధికారం ఉండి కూడా అం దరు ఐకమత్యంగా పనిచేయాల్సిన బాధ్యత ఉన్న ప్పటికీ గజ్వేల్ నియోజకవర్గంలో గ్రూపు రాజ కీయాలు చేయడం వల్ల కాంగ్రెస్ పార్టీకి తీరని నష్టం కలుగుతుందని కార్యకర్తలు వాపోతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టులు లేక ఎవరు ఇస్తారో అనే ఆశతో ఏ లీడర్ వెంట ఉండాలి అనే అయోమయ పరిస్థితిలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గ్రూపు రాజకీ యాల మూలంగా కాంగ్రెస్‌లోకి చేరాలంటే కార్య కర్తలు వెనుకంజ వేస్తున్నారు. ఈ గ్రూపు రాజ కీయాలపై అధిష్టానం పట్టించుకోకపోతే పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని పలువురు అనుకుంటున్నారు.

## జీవశాస్త్ర విజ్ఞానం పట్ల అవగాహన ఉండాలి



టాలెంట్‌టెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

**వెల్దుర్తి, డిసెంబరు 9, ప్రభాతవార్త:** అభివృద్ధి చెందిన సమాజంలో ప్రతి విద్యార్థి, పౌరుడు జీవశాస్త్ర విజ్ఞానం పట్ల, పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కలిగి ఉండాలని, భవిష్యత్తులో తన ఆరోగ్యం, జీవన విధానం, సుస్థిరాభివృద్ధి, సుస్థిర పర్యావరణ స్పృహ, శాస్త్రీయ ఆలోచన, శాస్త్రీయ అవగాహన కలిగి ఉండడానికి జీవశాస్త్రం ఎంతో ఉపయోగపడుతుందని తెలంగాణ బయోసైన్స్ ఫోరం (టిబిఎస్ఎఫ్) వెల్దుర్తి మండలాధ్యక్షులు ప్రమోదిని తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు మండలస్థాయి జీవశాస్త్ర టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవశాస్త్రం ప్రాథమిక అంశాలను ప్రాథమిక, ఉన్నతస్థాయిలో అత్యంత ప్రాధాన్యత కలిగిన సబ్జెక్టుగా మార్చి విద్యార్థుల శాస్త్రీయవైఖరిని, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని, సుస్థిరాభివృద్ధి, వైఖరులను అభివృద్ధి చెందించే ఉద్దేశంతో జీవశాస్త్ర టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలోని అన్ని ప్రభుత్వరంగ పాఠశాలలలో పాఠశాలస్థాయిలో ఇంగ్లీష్, తెలుగుమీడియం లలో ప్రథమస్థానం, ద్వితీయస్థానం వచ్చిన విద్యార్థులకు మండలస్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగిందన్నారు. ఈటాలెంట్ టెస్ట్‌లో ఇంగ్లీష్ మీడియం విభాగంలో జగ్గ శ్రీచరణ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి ప్రథమస్థానం, హనుమద్రి చంద్రవర్ధన్ గౌడ్, జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల వెల్దుర్తి ద్వితీయస్థానం, తెలుగు మీడియంలో వై.శ్రీజ, జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల మానేపల్లి ప్రథమస్థానం, టి.దుర్గ, జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల కుకునూర్ ద్వితీయస్థానం పొందడం జరిగింది. ఈవిద్యార్థులకు డిసెంబర్ 18వ జిల్లాస్థాయి జీవశాస్త్ర టాలెంట్ టెస్ట్‌కు పంపడం జరుగుతుంది.

## శాస్త్రీయ ఆలోచనావిధానానికి టాలెంట్ టెస్ట్




ప్రతిభ సాధించిన విద్యార్థులకు ధృవపత్రాలను అందజేస్తున్న దృశ్యం

**కొల్చారం, డిసెంబరు 9, ప్రభాతవార్త:** ప్రాథమిక, ఉన్నతస్థాయిలో విద్యార్థుల్లో శాస్త్రీయవైఖరిని పెంపొందించే ఉద్దేశంతో జీవశాస్త్ర టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించడం జరుగుతుందని తెలంగాణ బయోసైన్స్ ఫోరం (టిబిఎస్ఎఫ్) కొల్చారం మండలాధ్యక్షులు ఎస్.రమణకుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన కొల్చారంమండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వరంగ పాఠశాలలలో ప్రథమస్థానం, ద్వితీయ స్థానంవచ్చిన విద్యార్థులకు మండలస్థాయి టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించడం జరిగింది. మండలస్థాయి టాలెంట్ టెస్ట్‌లో ఇంగ్లీష్‌మీడియం విభాగంలో జె.అక్షయ్‌కుమార్ ప్రథమస్థానం జెడ్పీహెచ్ఎస్ కొల్చారం, బి.అక్షయ ద్వితీయ స్థానం జెడ్పీహెచ్ఎస్ కొల్చారం, తెలుగుమీడియం విభాగంలో డి.నౌషిన్, ప్రథమస్థానం జెడ్పీహెచ్ఎస్ చిన్నగనపూర్, టి.దయాశీల ద్వితీయస్థానం జెడ్పీహెచ్ఎస్ వరిగుంతం పొందడం జరిగింది. వీరికి డిసెంబర్ 18న జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్‌కు పంపడం జరుగుతుంది.

## వడ్లలారీని పట్టుకున్న లారీల యజమానులు

**చేర్యాల, డిసెంబరు 9, ప్రభాతవార్త:** ట్రక్‌షీట్ లేకుండా రవాణా చేస్తున్న లారీని చేర్యాల లారీ యజమానులు సోమవారం సాయంత్రం పట్టుకు న్నారు. సిద్దిపేట జిల్లా తుర్కపల్లి నుండి చేర్యాల శివారులోని ఓ రైస్ మిల్‌కు ఐకెపికి సంబంధించిన వడ్లను ట్రక్‌షీట్ పేపర్లు లేకుండా రవాణా చేస్తున్నట్లు అనుమానంకలగడంతో చేర్యాల లారీల యజమానులు కొందరు వడ్లను రవాణాచేస్తున్న లారీని పట్టుకుని పోలీసులకు అప్పగించా రని, పోలీసులు లారీని స్వాధీనంచేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు సమాచారం.

## విద్యార్థులకు మండలస్థాయి సైన్స్ టాలెంట్ టెస్టు



టెస్టులో గెలుపొందిన విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న దృశ్యం

**మర్కూక్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** మండలంలోని బయాలాజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం పాములపర్తి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో మండలస్థాయి సైన్స్ టాలెంట్ టెస్టును నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఐదు పాఠశాలల్లో మొదటి, రెండవ స్థానం గెలుపొందిన విద్యార్థులకు మండలస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ టెస్టుల్లో విజేతలుగా బేతి నాగచైతన్యరెడ్డి (జెడ్‌పిహెచ్ఎస్ పాములపర్తి) ప్రథమ స్థానంలో నిలువగా కెజిబివి పాఠశాలకు చెందిన పూజ ద్వితీయ స్థానంలో నిలిచారు. తెలుగు మీడియంలో మర్కూక్ జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాలకుచెందిన నవ్య ప్రథమస్థానం, కీర్తన ద్వితీయస్థానంలో నిలిచారు.

హాజరైన విద్యార్థులందరికీ సర్టిఫికెట్స్, విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ వెంకట్రాములు మాట్లాడుతూ మండలస్థాయి టాలెంట్ టెస్టులో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లతి సైదా, మండల సైన్స్ ఫోరం అధ్యక్షుడు వంటేరు శ్రీనివాస్‌రెడ్డి, పిఆర్‌టియు మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి కుమార్, రాష్ట్ర బాధ్యులు షాబుద్దీన్, గణేష్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

**మర్కూక్, డిసెంబరు 9 (ప్రభాతవార్త):** కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా మండల పరిధిలోని పాములపర్తిలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కనకయ్యగౌడ్ సమక్షంలో వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి ఒకరికొకరు తినిపించుకొని సోనియాగాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్యాంప్రసాద్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు బిక్షపతి, నర్సింలు, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సర్పంచుల ముందస్తు అరెస్టు

### అప్పులు చేసి వడ్డీలు కడుతున్నాం... పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి
### అరెస్టులు చేయడం సరికాదు
### మాజీ సర్పంచుల ఆవేదన

**చిన్నశంకరంపేట, డిసెంబరు 9, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించడం లేదని సర్పంచ్‌ల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు పూలపల్లి యాదగిరి యాదవ్ ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలంటూ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం జెఏసి చలో సెక్రటేరియట్ ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా చిన్నశంకరంపేట పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పూలపల్లి యాదగిరి యాదవ్ మాట్లాడుతూ ప్రజా పాలన అని చెప్పి ప్రశ్నించే గొంతుకలను ఈప్రభుత్వం పోలీసులతో పూర్తిగా నొక్కించాలని చూస్తుందన్నారు. 2019 నుంచి 2024 వరకు సర్పంచ్‌లు చేసిన పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఆబిల్లులు విడుదలచేసిన తరువాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్‌లు శాంతియుతంగా నిరసన తెలిపెందుకు వెళ్తుంటే పోలీసులు అరెస్టులు చేయడం సరికాదన్నారు. అప్పులుచేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశామని, అప్పులకు వడ్డీలు చెల్లించలేక రోడ్డున పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. మాజీ సర్పంచ్‌లకు రావలసిన పెండింగ్ బిల్లులు విడుదలచేయాలని డిమాండ్‌చేశారు.



పోలీసులు అరెస్టు చేసిన మాజీ సర్పంచ్‌లు

కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు జ్యోతి ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, కుంట నరేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు బిల్లులను వెంటనే చెల్లించాలంటూ మండలానికి చెందిన వివిధ గ్రామాల సర్పంచ్‌లు జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

## మాజీ సర్పంచ్ ప్రవీణ్ ముందస్తు అరెస్ట్



మర్కూక్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐ రవీందర్‌తో మాజీ సర్పంచ్ ప్రవీణ్

**మర్కూక్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని డిమాండ్‌చేస్తూ మాజీ సర్పంచ్‌ల జెఏసి సోమవారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని వర్ధరాజ్‌పూర్ మాజీ సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు ప్రవీణ్‌ను సోమవారం తెల్లవారుజామున తన స్వగృహంలో ఏఎస్ఐ రవీందర్ ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ప్రవీణ్ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. గ్రామపంచాయతీల్లో ప్రభుత్వం బిల్లులు ఇస్తుందన్న నమ్మకంతో అప్పులుచేసి గ్రామాభివృద్ధికి ఖర్చుచేస్తే బిల్లులురాక మాజీ సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసి మాజీ సర్పంచ్‌లను ఆదుకోవాలని కోరారు. అనంతరం సొంతపూచీకత్తుపై ప్రవీణ్‌ను పోలీసులు వదిలిపెట్టారు.

## తెలంగాణ తల్లి అస్తిత్వానికి భంగం

**గుమ్మడిదల, డిసెంబరు 9, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి అస్థిత్వాన్ని భంగపరిచిందని సోమవారం గుమ్మడిదల గ్రామంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలువేసి నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ తెలంగాణ తల్లి నడుముకు వడ్డాణం, తలకు కిరీటం తొలగించడం పట్ల ఆంతర్యం ఏమిటని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఏర్పాటుచేసిన తెలంగాణ తల్లి విగ్రహం మార్పుపై బిఆర్ఎస్ నేతలు అసహనం వ్యక్తంచేశారు.

## ఓర్వలేకే తెలంగాణ తల్లి రూపం మార్చింది

**మెదక్ మున్సిపాలిటీ, డిసెంబరు 9, ప్రభాతవార్త:** రేవంత్ రెడ్డి ప్రభుత్వం దేవతరూపంలో ఉన్న తెలంగాణ తల్లిపై ఓర్వలేక రూపం మార్చిందని, ప్రభుత్వ మూర్ఖపువిధానానికి నిదర్శనమే తెలంగాణ తల్లి రూపం మార్చడమని మెదక్ పట్టణ కన్వీనర్, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రసాధనలో అనేకమంది తల్లుల త్యాగాల ప్రతిమనే తెలంగాణ తల్లి విగ్రహమని, మనం నిత్యం కొలిచే శక్తిమాతలకు ప్రతిబింబంగా ఉండే తెలంగాణ తల్లిని మార్చి ఎలాంటి ఆభరణాలు లేకుండా తెలంగాణ తల్లి రూపాన్ని చెయ్యి గుర్తు వచ్చే విధంగా, ఉద్యమ తల్లులత్యాగాలను అవమానించే విధంగా తెలంగాణ తల్లి రూపం మార్చడం దురదృష్టకరం అన్నారు. తెలంగాణ తల్లి రూపం మార్చడంపై చూపిన శ్రద్ధను తెలంగాణతల్లులకు ఇచ్చినమాట ప్రకారం ప్రతి మహిళకు 2500 రూపాయలు, వృద్ధులకు 4000 రూపాయల పెన్షన్, మహిళా విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీ, కళ్యాణలక్ష్మి లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇవ్వడంపై ప్రభుత్వం దృష్టిపెట్టాలని బిఆర్ఎస్ మెదక్ పట్టణ కమిటీ డిమాండ్ చేస్తుందన్నారు.

## మాజీ సర్పంచ్‌లను ముందుస్తు అరెస్టుచేసిన పోలీసులు

**వెల్దుర్తి, డిసెంబరు 9, ప్రభాతవార్త:** పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం హైదరాబాద్‌లో ధర్నాకు తరలివెళ్తున్న తాజా మాజీ సర్పంచ్‌లను అక్కడికి వెళ్లకుండా వెల్దుర్తి పోలీసులు అడ్డుకున్నారు. సోమవారం మండల పరిధిలోని బస్వాపూర్, జలాల్‌పూర్ గ్రామాలలో తాజా మాజీ సర్పంచ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారి సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ మల్లేశం గౌడ్, కిట్టుతో పాటు పలువురు పాల్గొన్నారు.

## పేదలకు ఆపన్నహస్తం సిఎంఆర్ఎఫ్

**పటాన్‌చెరు, డిసెంబరు 9, ప్రభాతవార్త:** ఆపదకాలంలో ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఆపన్నహస్తం అందిస్తోందని పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జెపికాలనీకి చెందిన గంగాధర్‌రెడ్డి కుమారుడు సాయికిరణ్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈనేపథ్యంలో మెరుగైన చికిత్స కోసం స్థానిక ఎమ్మెల్యే ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. బాలునిచికిత్స కోసం మంజూరైన 2లక్షల 50వేల రూపాయల విలువైన ఎల్ఓసి అనుమతిపత్రాన్ని సోమవారం ఎంఎల్ఏ మహిపాల్ రెడ్డి బాలుని తండ్రికి అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూర్తి పారదర్శకతతో ప్రభుత్వ సంక్షేమపథకాలను అమలుచేస్తూ ప్రజాపాలన అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపిలు యాదగిరి యాదవ్, దేవానంద్, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచులు అంతిరెడ్డి, భాస్కర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఓల్డ్ ఏజ్ హోమ్‌లో పండ్ల పంపిణీ

**నర్సాపూర్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** మెదక్ జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రియాజ్ అలీ ఆధ్వర్యంలో నర్సాపూర్‌లోని డంగోరియా ఆసుపత్రిలో గల ఓల్డ్ ఏజ్ హోమ్‌లో వృద్ధులకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ జన్మదిన వేడుకల సందర్భంగా ఓల్డ్ ఏజ్ హోమ్‌లో వృద్ధులకు పండ్ల పంపిణీ చేశారు. ఈసందర్భంగా రియాజ్ అలీ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల 60 ఏండ్ల ఆకాంక్షలు నెరవేర్చిన తల్లి సోనియమ్మ అని పేర్కొంటూ సోనియాగాంధీ తెలంగాణాకు చేసిన సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ అల్తాఫ్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు అరిగే సాయికుమార్, చక్రవర్తి గౌడ్, ఇనయత్‌ఖాన్, ప్రధాన కార్యదర్శులు షేక్ సోఫి, షేక్ ఇబ్రహీం, నియోజకవర్గ వివిధ మండలాల అధ్యక్షులు ధన్సింగ్, యాదవ్ రెడ్డి, నరేష్, విజయ్‌కుమార్‌యాదవ్, నర్సాపూర్ మండలం ఉపాధ్యక్షుడు హఫీజ్, యువజననాయకులు, వల్లిగారి సాయి, షేక్ యాదుల్ తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## టెంట్ హౌజ్‌ను ప్రారంభించిన ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, డిసెంబరు 9, ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని కొడకంచిలో బిఆర్ఎస్ నేత మహేష్ ఏర్పాటు చేసిన శ్రీదుర్గాభవాని టెంట్ హౌజ్‌ను బిఆర్ఎస్ రాష్ట్రనేత వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. కొడకంచి మాజీసర్పంచ్ శ్రీశైలం తనయుడు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైనట్లు తెలుసుకున్న ఆదర్శ్‌రెడ్డి శ్రీశైలంఇంటికి చేరుకుని కుమారుడిని పరామర్శించారు. గడ్డిపోతారం మాజీసర్పంచ్ ప్రకాష్‌వారి ఏర్పాటుచేసిన అయ్యప్ప స్వామి మహాపడిపూజ కార్యక్రమంలో ఆదర్శ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, జిన్నారం మాజీ జడ్పీటిసి సభ్యులు బాల్‌రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వెంకటేష్‌గౌడ్, జిన్నారం మండల పార్టీ అధ్యక్షులు రాజేష్, కొడకంచి మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

**రామచంద్రాపురం, డిసెంబరు 9, ప్రభాతవార్త:** కాంగ్రెస్‌ప్రభుత్వ ఏడాది పాలనను సిఎం రేవంత్‌రెడ్డి విజయవంతంగా పూర్తిచేసి, సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని సండేమార్కెట్ వార్డు కార్యాలయంలో సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ కాంగ్రెస్ నాయకులతో కలిసి పాలాభిషేకం చేశారు.

## కుర్తివాడ ఉన్నతపాఠశాలలో మాక్ పోలింగ్

**పాపన్నపేట, డిసెంబరు 9, ప్రభాతవార్త:** పాపన్నపేట మండల పరిధిలోని కుర్తివాడ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు వెంకట్రాంరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులు ప్రిసైడింగ్ అధికారిగా, పోలింగ్ అధికారులుగా విధులు నిర్వహించారు విద్యార్థులు ఓటర్లుగా బారులుతీరి ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఓటింగ్ యొక్క గొప్పతనాన్ని తెలుసుకునేందుకు మాక్ పోలింగ్ నిర్వహించామని తెలిపారు.

## ఏడుపాయల టెండర్ల ఆదాయం రూ.1.15లక్షలు

**పాపన్నపేట, డిసెంబరు 9, ప్రభాతవార్త:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయానికి టెండర్ల ద్వారా రూ.1.15లక్షల ఆదాయం సమకూరింది. సోమవారం ఆలయ కార్యాలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి, ఈవో చంద్రశేఖర్‌లు వ్యాపారాలకు సంబంధించిన వేలం నిర్వహించారు. దేవస్థాన ప్రాంగణంలో చెప్పులస్టాండు నిర్వహణ కోసం వేలంవేయగా మెదక్‌పట్టణానికి చెందిన అరవింద్ రూ.1.15లక్షలకు హెచ్చుపాట పాడి దక్కించుకున్నాడు. కొబ్బరికాయల అమ్మకం, ఒడిబియ్యం పోగు చేసుకునేందుకు, ఆలయం వద్ద పూజాసామాగ్రి విక్రయించుకునేందుకు వేలంవేయగా పాల్గొనేవారు లేకపోవడంతో వాయిదా వేశారు. వాయిదావేసిన టెండర్లను త్వరలో నిర్వహిస్తామని ఈవో తెలిపారు. ఆలయసిబ్బంది సూర్య శ్రీనివాస్, ప్రతాప్ రెడ్డి, శ్యాం, తదితరులున్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## విద్యార్థులకు భోజనసామగ్రి పంపిణీ

**నర్సాపూర్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** నర్సాపూర్ మండల్ బ్రాహ్మణపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థినీవిద్యార్థులకు భోజనసామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈమేరకు భోజనసామగ్రి దాత ఇదే గ్రామానికి చెందిన కీర్తిశేషులైన పల్లె జీవన్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన పేరిట ఆయన కుమారుడు నరసింహారెడ్డి, కూతురు వనజ, అల్లుడు సాయిరెడ్డిలు పాఠశాలలోని విద్యార్థులందరికి ప్లేట్లు, టిఫిన్, స్పూన్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీశైలం, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంబాబు, శేఖర్, ఉపాధ్యాయులు యోగి, గ్రామ పెద్దలు సుధీర్‌కుమార్ గౌడ్, ఆకుల నర్సింలు, గొల్ల ఆనంద్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడికి సన్మానం

**నాగల్‌గిద్ద, డిసెంబరు 9, ప్రభాతవార్త:** మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికైన సచిన్‌పాటిల్‌ను సోమవారం కరస్‌గుత్తి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. మండలంలో పార్టీ అభ్యున్నతికి తన వంతు కృషిచేస్తానని యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సచిన్‌పాటిల్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు గుండేరావు పాటిల్, అనిల్‌పాటిల్, మాజీ సర్పంచ్‌లు శ్రీకాంత్, ఉమ్మడి మనూర్ సొసైటీ చైర్మన్ అంబ్రేష్, బస్వరాజ్, బి హనుమంతు, రోహన్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

**చిన్నశంకరంపేట, డిసెంబరు 9, ప్రభాతవార్త:** మండల పరిధి చందంపేటలోని పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. రెండు రోజుల పాటు ఆలయ ఉత్సవాలు జరుగనున్నట్లు ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 406 మందికి రుణ మాఫీ

**చిన్నశంకరంపేట, డిసెంబరు 9, ప్రభాతవార్త:** 4వ విడత రైతు రుణమాఫీ చిన్నశంకరంపేట మండలంలో 406మందికి జరిగిందని మండల వ్యవసాయాధికారి లక్ష్మీ ప్రవీణ్ తెలిపారు. సోమవారం చిన్నశంకరంపేటలో మాట్లాడుతూ రెండులక్షల లోపు రుణం ఉన్నవారికి మాఫీ చేశారని, మరో వారంరోజుల్లో రుణాలు మాఫీ అయి, రైతుల ఖాతాలో జమ అవుతాయని వివరించారు.

## సోనియా గాంధీ 78వ జన్మదినోత్సవ వేడుకలు

**గుమ్మడిదల, డిసెంబరు 9, ప్రభాతవార్త:** సోనియా గాంధీ 78వ జన్మదినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మండల కేంద్రమైన గుమ్మడిదలలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు ఆధ్వర్యంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచుకున్నారు. అనంతరం ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో అనారోగ్యంతో ఉన్నవారికి పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురువక్తలు మాట్లాడుతూ ఎందరో విద్యార్థుల బలిదానాలను చూసి చలించిపోయి ఒక కన్నతల్లి ఆవేదనను గమనించిన సోనియా గాంధీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని, యువత తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా కూడా బలిదానాలు చేసుకోవద్దని చెప్పిన మాతృమూర్తి సోనియా గాంధీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పడమటి లక్ష్మారెడ్డి, లక్ష్మీనారాయణ, ఇప్ప రాంరెడ్డి, తుడుము శ్రీనివాస్, మహిపాల్ రెడ్డి, మహేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

**జహీరాబాద్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** పట్టణంలోని జాతీయ రహదారి పక్కలో గల మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ ఇందిరా గాంధీ విగ్రహం వద్ద సోమవారం మాజీ ఏసిసిసి అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలు పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సోనియా గాంధీ బర్త్‌డే కేక్‌ను కాంగ్రెస్ నాయకులతో కలసి కట్‌చేసి నోటిని తీపిచేసుకున్నారు. కార్యక్రమంలో సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కండెం నర్సింలు, మండల అధ్యక్షులు, నాయకులు నరసింహారెడ్డి, మక్సూద్, మంకాల్ సుభాష్, ఎంపి రాములు యాదవ్, ఎండి ఖాజా మియా, నరేష్ గౌడ్, కె.భీమయ్య, నాగిరెడ్డి, ఖండం సుజాత తదితరులు పాల్గొన్నారు.

**రామాయంపేటలో...**

**రామాయంపేట, డిసెంబరు 9, ప్రభాతవార్త:** రామాయంపేట మండల కేంద్రంలో సోమవారం యూపిఎ చైర్‌పర్సన్, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ జన్మదిన వేడుకలను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. సోనియాగాంధీ జన్మదినం పురస్కరించుకొని స్థానిక మెదక్ చౌరస్తాలో కేక్ కట్‌చేసి సంబరాలు నిర్వహించారు. ఆయురారోగ్యాలతో సోనియాగాంధీ కలకాలం జీవించాలని భగవంతుని కోరుకున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. సోనియాగాంధీ తెలంగాణ దేవత పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు దేమె యాదగిరి, చిలుక గంగాధర్, సుందర్‌సింగ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చౌదరి సుప్రభాతరావు, రమేష్‌రెడ్డి, విప్లవకుమార్, కుమార్‌సాగర్, సుంకోజు దామోదర్, యుగంధర్‌రావు, బైరం కుమార్, బొట్ల బాబు, దండు శివ, చింతల స్వామి, దేవుని రాజు, పోచమ్మల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**నిజాంపేటలో...**

**నిజాంపేట, డిసెంబరు 9, ప్రభాతవార్త:** నిజాంపేట మండల కేంద్రంలో స్థానిక రేణుక ఎల్లమ్మ ఆలయ ఆవరణలో సోమవారం కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల చిరకాల కోరిక ప్రత్యేకరాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు ఉండాలని రేణుక ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పంజా మహేందర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మారుతి, ఎంఎస్ఎస్‌వో ఇంచార్జి వెంకటేశ్ గౌడ్, అజయ్, మధుసూదన్‌రెడ్డి, కొమ్మాట సత్యనారాయణ, లింగంగౌడ్, సొమ్మ బాబు, మసూద్, బాజె రమేష్, పెద్దపైడి రాజిరెడ్డి, సామల మహేష్, రాజేందర్‌గౌడ్, భూమాగౌడ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లౌడియా రామచందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**టేక్మాల్‌లో...**

**టేక్మాల్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** 60 ఏళ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ప్రసాదించిన తెలంగాణ దేవత కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ అని టేక్మాల్ మండల పార్టీ అధ్యక్షులు నిమ్మ రమేష్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సంగమేశ్వర్ గౌడ్ అన్నారు. సోమవారం సోనియాగాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని టేక్మాల్ మండల యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆమె జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని స్థానిక చౌరస్తా వద్ద ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రజల బలిదానాలను చూసి చలించిపోయి ఆనాడు పార్టీ నష్టపోతున్నా కూడా లెక్కచేయకుండా తెలంగాణ ప్రజల ఆకాంక్షమేరకు ప్రత్యేకరాష్ట్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో మండల మాజీ కో-ఆప్షన్ సభ్యులు మజర్, మండల అధ్యక్షుడు ఆడివయ్య, యువజన కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి సిద్దు టేక్మాల్ పట్టణ అధ్యక్షులు కిషోర్, మండల నాయకులు సర్వని లక్ష్మణ్, సాగర్, ఖలీల్, రాజు, లక్ష్మీనారాయణ, వివిధ గ్రామాల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్, సంగమేశ్వర్, శ్రీకాంత్, యువ నాయకులు శేషు గౌడ్, ధనుంజయ్, కృష్ణ, వేణు పాల్గొన్నారు.

**అల్లాదుర్గంలో...**

**అల్లాదుర్గం, డిసెంబరు 9, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన అల్లాదుర్గంలో సోమవారం ఏఐసిసి మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 25మందికి మెరుగైన చికిత్స అందుకునేందుకు 9లక్షల 57వేల 5వందల రూపా యల సిఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు బాధితులకు అందచేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శేషారెడ్డి, నాయకులు సుభాష్‌రావు దేశ్‌పాండే, బలరాం, అంజాగౌడ్, సదానందం, దేవసోత్ రంజిత్, చెన్నప్ప, సాయిబాబా, శ్రీనివాస్‌రెడ్డి, రవి, సత్యనారాయణ, బేతయ్య, రాములు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

**కరస్‌గుత్తిలో...**

**నాగల్‌గిద్ద, డిసెంబరు 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కరస్‌గుత్తిలో సోమవారం ఏఐసిసి మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని పిహెచ్‌సిలో రోగులకు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సచిన్ పాటిల్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గుండేరావు పాటిల్, అనిల్‌పాటిల్, మాజీ సర్పంచ్‌లు శ్రీకాంత్, ఉమ్మడి మనూర్ సొసైటీ చైర్మన్ అంబ్రేష్, బస్వరాజ్, బి హనుమంతు, రోహన్ పాల్గొన్నారు.

**సోనియమ్మ వల్లే తెలంగాణ...**

**పటాన్‌చెరు, డిసెంబరు 9, ప్రభాతవార్త:** నాలుగున్నరకోట్ల ప్రజల ఆకాంక్షలను అర్థంచేసుకొని తమపార్టీని పణంగా పెట్టి తెలంగాణ ప్రజలకు స్వరాష్ట్రాన్ని ఇచ్చిన ఘనత సోనియా గాంధీకే దక్కుతుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని చిట్కుల్లోని ఎన్ఎంఆర్ క్యాంపు కార్యాలయంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోనియమ్మ కృషితోనే అసాధ్యం అనుకున్న తెలంగాణ రాష్ట్రసాధన సుసాధ్యం అయిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**వెల్దుర్తిలో...**

**వెల్దుర్తి, డిసెంబర్ 9 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన వెల్దుర్తిలోని బస్టాండ్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ అధినేత సోనియా గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్‌శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం బస్టాండ్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి సోనియాగాంధీ అని అన్నారు. కాంగ్రెస్ నాయకులు శేఖర్ గౌడ్, పట్టణ నాయకుడు మల్లేష్, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కిష్టాగౌడ్ పాల్గొన్నారు.

**చేర్యాలలో...**

**చేర్యాల, డిసెంబరు 9, ప్రభాతవార్త:** చేర్యాల మండలంతో పాటు పట్టణంలో కాంగ్రెస్ పార్టీశ్రేణులు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంగడి బజార్‌లో నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వీట్లు పంపిణీ చేశారు.

**దూళిమిట్టలో...**

దూళిమిట్ట మండల కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకుల ఆధ్వర్యంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. మండలాధ్యక్షులు కోల సాయిలు, మండల ప్రధాన కార్యదర్శి గద్దల మహేందర్, సీనియర్, యూత్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**ప్రత్యేక పూజలు...**

**చేర్యాల, డిసెంబరు 9, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజల ఆకాంక్షలతో పాటు విద్యార్థుల బలిదానాలను గుర్తించి తన జన్మదినం రోజున కానుకగా తెలంగాణను ప్రత్యేకరాష్ట్రంగా ప్రకటించదని సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గురుస్వామి వెలుగల మల్లేశం తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

### రైతులను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు కృషికల్ప ఫౌండేషన్ కృషి

**కలెక్టర్ మనుచౌదరి**

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** రైతులను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు కృషికల్ప ఫౌండేషన్ కృషి చేస్తుందని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో వ్యవసాయ,ఉద్యానశాఖ సంయుక్తంగా కృషికల్ప, జిల్లా యంత్రాంగం సహకారంతో నిర్వహించిన అగ్రిసినర్జీ 2024 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన పంటను సరైన ధరకు అమ్ముకునేందుకు ఎఫ్‌పిఓ(ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్స్)ల ద్వారా కృషికల్ప ఫౌండేషన్ సహకరిస్తుందన్నారు. జిల్లాలోని అక్కన్నపేట మండలంలో ప్రహర్ష, ప్రసిద్ధ ఎఫ్‌పిఓల ద్వారా ఈ కార్యక్రమాన్ని అమలుచేయడంనజరుగుతుందన్నారు. అధునాతన పద్దతులు జిల్లాలోని రైతులకు ప్రయోజనకరంగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాధిక, ఉద్యానవనశాఖ అధికారి సువర్ణ, కృషి కల్ప ఫౌండేషన్ సీఈఓ సిఎం పాటిల్, నాబార్డ్ డిడిఎం నిఖిల్, వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### సిఎం క్రికెట్ ట్రోఫీకి పిసిసి అధ్యక్షుడికి ఆహ్వానం



సిఎం క్రికెట్ ట్రోఫీకి రావాలని పిసిసి అధ్యక్షుడిని ఆహ్వానిస్తున్న గడ్డం శ్రీనివాస్‌రెడ్డి

**సిద్ధిపేట అర్బన్, డిసెంబరు 9, ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయడానికి నిర్వహిస్తున్న సిఎం క్రికెట్ ట్రోఫీకి రావాలని పిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌గౌడ్‌ను సోమవారం నిర్వాహకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి హైదారాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ట్రోఫీకి క్రీడాకారుల నుంచి చక్కటి స్పందన వస్తుందని వివరించినట్లు తెలిపారు. ప్రతి నిత్యం పోటీలు పోటా పోటీగా సాగుతున్నాయని పోటీలకు రావాలని మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఆహ్వానించినట్లు తెలిపారు. సిఎం జన్మదినం సందర్భంగా క్రికెట్ ట్రోఫీ నిర్వహిస్తున్న గడ్డం శ్రీనివాస్‌రెడ్డిని పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ అభినందించారు.

### బిజెపి 7వ బూత్ అధ్యక్షుడిగా ఎల్లయ్య



నియామక పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

**హుస్నాబాద్ టౌన్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ హుస్నాబాద్ 7వ బూత్ అధ్యక్షుడిగా జేరిపోతుల ఎల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు దొడ్డి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం పట్టణంలో బూత్‌స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహిళా మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి తోట స్వరూప హాజరయ్యారు. బూత్ అధ్యక్షుడితోపాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చిట్టిగోపాల్‌రెడ్డి, ఎల్లయ్య, అరుణ్, సతీష్, కృష్ణమూర్తి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి కరాటే పోటీలో విద్యార్థులకు బంగారుపతకం



విద్యార్థులను అభినందిస్తున్న సీఐ శ్రీనివాస్

**హుస్నాబాద్ రూరల్, డిసెంబరు 9, ప్రభాతవార్త :** రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలు ఇటీవల హన్మకొండలోని కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించగా ఈ పోటీలలో హుస్నాబాద్ పట్టణంలోని కేరళ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు 21 మంది పాల్గొన్నారు. 9మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్‌తోపాటు 8 మందికి సిల్వర్, ముగ్గురికి బ్రాంజ్ మెడల్స్ గెలుచుకున్నారు. కాగా పోటీలలో ప్రతిభచూపిన విద్యార్థులను సోమవారం హుస్నాబాద్ సీఐ కొండ్ర శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, చైర్మన్ బుర్ర రాజేందర్, కరస్పాండెంట్ అల్లి శైలేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

### అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు పూర్తి చేయాలి

**కొమురవెల్లి, డిసెంబరు 9, ప్రభాతవార్త :** శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయాన్ని భక్తులు ఇచ్చే కానుకలతో అభివృద్ధి చేస్తామని టెం డర్లు పిలిచిన సకాలంలో కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయకపోవడంతో దేవాలయ ఆదాయానికి గండిపడుతుందని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి తాడూరు రవీందర్ అన్నారు. సోమవారం సీపీఎం బృందం 63 లక్షలు వెచ్చించి నిర్మించిన దమరుకం నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 నెలల క్రితం రూ.63 లక్షల నిర్మాణ వ్యయంతో ఏడాదిలో నిర్మించ తలపెట్టిన నిర్మాణం కాంట్రాక్టర్ జాప్యంతో ఇంతవరకు పూర్తి చేయలేదన్నారు. నిర్మాణానికి మరో రూ.14 లక్షలు అవసరమని ప్రతిపాదనలు పంపారంటే దేవాలయ ఆదాయానికి గండికొట్టి కాంట్రాక్టర్ లాభం చేసేలా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సకాలంలో పనులు పూర్తిచేయని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని కాంట్రాక్టు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పనుల్లో జాప్యం జరుగుతున్నా ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. మంచినీటి సౌకర్యం, వీధిదీపాలు ఏర్పాటు చేయడం లో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కృష్ణా రెడ్డి, ఇస్తారి, బిక్షపతి, రాంరెడ్డి, యాదయ్య, యాదగిరి, దయనందు, భారత్‌కుమార్, రాజు, రాకేష్, మల్లేశం పాల్గొన్నారు.

### అంక్షరెడ్డికి ఘనంగా సన్మానం

**కొండపాక, డిసెంబర్ 9, ప్రభాతవార్త :** యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా ఎన్నికైన తుంకుంటా అంక్షరెడ్డిని, జిల్లా, నియోజవర్గ, మండల అధ్యక్షులుగా నియమితులైన రాజశేఖర్‌రెడ్డి, అజాద్, బాబును సోమవారం గజ్వేల్‌లో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కుకునూరుపల్లి మండల పార్టీ అధ్యక్షుడు విరుపాక శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మిట్టపల్లి రుషి, ఎర్రవల్లి కిష్టరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంక్షరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

## ప్రజావాణికి అధికారులు సమయపాలన పాటించాలి

**మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**



ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబరు 9 ప్రభాతవార్త:** ప్రతి సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి వివిధ శాఖల అధికారులు సమయపాలనకు ప్రాధాన్యత ఇవ్వాలని అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజావాణిలో సంబంధిత డీఆర్వో భుజంగరావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్‌డీవో శ్రీనివాసరావు సంబంధిత ఇతరశాఖల అధికారులతోకలిసి వివిధ సమస్యలపై ప్రజావాణికి వచ్చిన ప్రజల నుండి వినతుల స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ ప్రజావాణిలో ప్రజల నుండి 53 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేసేందుకు, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రజావాణి నిర్వహిస్తున్నామని, అధికారులందరూ ప్రజావాణి రోజున, ఉదయం 10.15 నిమిషాల వరకు హాజరై అటెండెన్స్‌లో సంతకం పెట్టాలన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు-06, ధరణి-23, పింఛన్‌లు-02, ఇతర సమస్యలు-22 మొత్తం 53 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును మీపరిధిలోఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మీ పరిధి కాని సమస్యలపై ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలన్నారు.

### విద్యార్థి దశ చాలా కీలకం : ఎస్ఐ

**కొమురవెల్లి, డిసెంబరు 9, ప్రభాతవార్త :** విద్యార్థి దశ చాలా కీలకమని.. సక్రమ మార్గంలో వెళ్లేవారు ఉన్నత స్థానాలకు చేరుకుంటారని ఎస్ఐ రాజు అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మహిళల రక్షణకు సీపీ డాక్టర్ అనురాధ అదేశాల మేరకు సోమవారం మండల పరిధిలోని ఐనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్ బాడ్ టచ్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, ఈవిటీజింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకునే సమయంలో ఎలాంటి చెడు ఆలోచనలకు తావివ్వకుడదన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలు, బాలికలపై ఎవరైనా ఈవిటిజింగ్ చేసిన వెంటనే డయల్ 100 లేదా సిద్దిపేట షీ టీమ్ నెంబరు 8712667434కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, హుస్నాబాద్ షీటీమ్ బృందం సదయ్య, హెడ్ కానిస్టేబుల్, మహిళా కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు ప్రశాంతి, కృష్ణ, శివకుమార్ పాల్గొన్నారు.

### పిహెచ్‌సి డాక్టర్‌ను వెంటనే బదిలీ చేయాలి



జిల్లా వైద్యధికారికి వినతి పత్రం ఇస్తున్న బిజెపి నాయకులు

**కొండపాక, డిసెంబరు 9, ప్రభాతవార్త :** కుకునూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేం ద్రంలో డాక్టర్ పర్వీన్ నిర్లక్ష్యంవల్ల రోజురోజుకు వైద్య సేవలు దిగజారిపోతున్నాయని కుకునూరుపల్లి బిజెపి మండల అధ్యక్షుడు ఎనుముల సంపత్‌రెడ్డి అధ్వర్యంలో సోమవారం జిల్లా వైద్యధికారి డాక్టర్ పల్వాన్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వైద్య సేవల్లో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచి రెండు సార్లు జాతీయ స్థాయి అవార్డు అందుకున్న కుకునూరుపల్లి పిహెచ్‌సిలో వైద్య సేవలు డాక్టర్ పర్వీన్ నిర్లక్ష్యం కారణంగా పేదలకు అందడంలేదన్నారు. ప్రతి రోజు 30 నుండి 40 మంది పేషంట్లు పిహెచ్‌సికి వస్తుండగా 80 నుండి 90 మంది వరకు వస్తున్నట్లుగా తప్పుడు రికార్డులు రాస్తున్నరని వివరించారు. పిహెచ్‌సిలో పనిచేసే హిందువులైన సిబ్బందికి సెలవులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. గతంలో నెలకు పిహెచ్‌లో 6నుండి8 డెలివరిలు చేయగా ప్రస్తుతం నెలకు ఒక్కటి కూడా డెలివరీ జరగడంలేదని దాంతో చుట్టుపక్కల గ్రామాల పేదలు ప్రైవేట్ అసుపత్రులకువెళ్లి ఆర్థికంగా నష్టపోతున్నరని తెలిపారు. వెంటనే ఆమెపై విచారణ జరిపి ఇక్కడినుండి బదిలిచేయాలని ఆయన డిఎంహెచ్‌ఒను కోరారు. అదే విధంగా కుకునూరుపల్లి పిహెచ్‌సిలో కొంత కాలంగా ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సు పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. కుకునూరుపల్లి పిహెచ్‌సికి 108 అంబులెన్స్‌ను మంజూరు చేసినందుకు డిఎం అండ్ హెచ్‌ఒకు కృతజ్ఞతలు తెలిపారు. అయన వె ంట కుకునూరుపల్లి బిజెపి మండల ప్రధాన కార్యదర్శి సదానందగౌడ్, కిసాన్ మోర్చ అధ్యక్షుడు గుర్రాల స్వామి, మండల నాయకులు ప్రేమ్ కుమార్‌రెడ్డి, కొకొండ రాజు చారి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

**కొండపాక, డిసెంబరు 9, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ అదినాయకురాలు సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా కుకునూరుపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద, కొండపాక మండల పరిధిలోని వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద సోమవారం కేక్ కోసి ఘనంగా పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అయా మండలాల పార్టీ అధ్యక్షులు వాసరి లింగరావు, విరుపాక శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన తల్లి సోనియా గాంధీ అన్నారు. త్యాగలకు మారు పేరు సోనియా గాంధీ కుటుంబం అన్నారు. మాజీ ప్రధాన మంత్రులు ఇందిర గాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసమే ప్రాణాలు త్యాగం చేసిన కుటుంబం అన్నారు. ప్రధాన మంత్రి పదవికి అవకాశం వచ్చిన పదవిని తృనప్రయంగా భావించి వదలివేసిన గొప్ప త్యాగమూర్తి సోనియా గాంధీ అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి మంచాల అనసూయ కనకరాములు, బూర్గుల సురేందర్, ప్రభాస్, మంద కొమురయ్య, పంబాల సురేందర్. రాజు, తూం మహేందర్, యెల్లు శ్రీనివాస్‌రెడ్డి, మిట్టపల్లి రుషి, లగిశెట్టి మహేందర్, ఇండ్ల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



కుకునూరుపల్లిలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం



అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న బిఆర్ఎస్ నాయకులు

### ఎమ్మెల్యేలను అసెంబ్లీకి రాకుండా అడ్డుకోవడం అప్రజాస్వామికం

**చిన్నకోడూరు, డిసెంబరు 9, ప్రభాతవార్తన:** మాజీ సర్పంచ్‌ల అక్రమ అరెస్టులు, బిఆర్ఎస్ ఎమ్మెల్యేలన అసెంబ్లీకి రానివ్వకుండ అడ్డుకోవడం అప్రజాస్వామికమని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కామురి శ్రీనివాస్, మండల ఎంపిటిసిల ఫోరం మాజీ అధ్యక్షులు ఇట్టబోయిన శ్రీనివాస్, మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు కాముని ఉమేష్‌చంద్ర, పార్టీ సీనియర్ నాయకులు జంగిటి శ్రీనివాస్‌లు తీవ్రంగా ఖండించారు. సోమవారం మండల కేంద్రంలోని చిన్నకోడూరు అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేసి అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో రోజు రోజుకూ నిర్బందాలు పెరిగిపోతున్నాయి తప్పితే ప్రజా సమస్యల పట్ల రేవంత్‌రెడ్డి సర్కారు దృష్టి సారించడం లేదన్నారు. మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు విడుదల చేస్తామని హామీ ఇచ్చి యేడాది గడిచిపోతున్న పట్టుమని పది రూపాయలు కూడ విడుదల చేయలేదన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం సర్పంచ్ పదవి కాలంలో ప్రస్తుత తాజా మాజీ సర్పంచ్‌లు అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేశారని తెచ్చిన అప్పులకు మిత్తిలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనపై దృష్టి పెట్టకుంటే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ నాయకులు కొండం రవీందర్‌రెడ్డి, పడిగెలింగం, మన్నె అనంద్, సబ్బెన కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

### పదవ తరగతి మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేయాలి



జిల్లా విద్యాధికారి రాధాకిషన్‌ను వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

**మెదక్ మున్సిపాలిటీ, డిసెంబరు 9 ప్రభాతవార్త:** మెదక్ జిల్లా కేంద్రంలో పదవ తరగతి మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్‌ను ఉపాధ్యాయ సంఘాలు సోమవారం కలిసి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి జిల్లా కలెక్టర్ ద్వారా డీఎస్ఈకి ప్రతిపాదనలు పంపిస్తానని తెలిపారు. మెదక్‌లో పదవ తరగతి మూల్యాంకన కేంద్రం లేకపోవడం వల్ల సంగారెడ్డి జిల్లాలోని బీహెచ్ఈఎల్‌కు ఉపాధ్యాయులు మూల్యాంకనానికి వెళ్లడంతో చాలా వ్యయ ప్రయాసలకు గురవుతున్నారని ఉపాధ్యాయ సంఘాలు వివరించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఎస్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షులు రాజగోపాల్ గౌడ్, తపస్ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

### ముంపు గ్రామస్థుల సమస్యలు పరిష్కరించాలి

**గజ్వేల్, డిసెంబరు 9 (ప్రభాతవార్త):** కొండపోచమ్మ సాగర్ ముంపు గ్రామస్తులకు న్యాయం చేయాలని సోమవారం గజ్వేల్ ఆర్డీఓ చంద్రకళకు మామిడ్యాల గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 7 సంవత్సరాల నుండి పరిహారం అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నామని న్యాయంగా మాకు రావాల్సిన పరిహారం ప్రభుత్వం అందించాలని డిమాండ్‌చేశారు. గతంలో డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇప్పిస్తామని చెప్పిన అప్పటి మాజీ కలెక్టర్ వెంకట్రాంరెడ్డి ఎన్నిసార్లు అతన్ని కలిసినా సమస్యలు పట్టించుకోలేదని వాపోయారు. మాకు సంబంధించిన భూములు, ఇండ్లు మీకు అవసరమొస్తాయి కానీ న్యాయం చేయడం ఎందుకు ఆలస్యమవుతుందని ఆర్డీఓ చంద్రకళకు వివరించారు. అనంతరం ఆర్డీఓ చంద్రకళ మాట్లాడుతూ ముంపు గ్రామస్తులకు తగు న్యాయం చేస్తానని, మీరు ఇచ్చిన దరఖాస్తును ఉన్నతాధికారులకు పంపించి వీలైనంత త్వరగా సమస్య పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న మామిడ్యాల గ్రామస్తులు

## ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో నిర్లక్ష్యం వద్దు




మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న

**హుస్నాబాద్ రూరల్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇళ్ల సర్వే విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలో ప్రజాపాలన ద్వారా ఇందిరమ్మ ఇళ్ల కోసం 4542 దరఖాస్తులు వచ్చాయని అందులో అర్హులను గుర్తించేందుకు నిర్వహించే సర్వేలో 26 మంది అధికారులు పాల్గొంటున్నారన్నారు. వార్డు ఆఫీసర్లు అందరూ ఇళ్లు లేని పేదలను గుర్తించి వారికి వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అయిలేని అనితశ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు కొంకటి నళిని, బోజు రమాదేవిరవీందర్, స్వర్ణలత, భాగ్యరెడ్డి, లావణ్య, పద్మ, వేణు, శ్రీనివాస్, రవి, శ్రీనివాస్, రాజు, బొల్లి కల్పనశ్రీనివాస్, సరోజన, రత్నమాల, రాజు, రమేష్, హరీష్, కోఆప్షన్ సభ్యులు శంకర్‌రెడ్డి, అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

**సర్వేను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్...**

పట్టణంలోని 4వ వార్డులో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే తీరును మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో కొన్ని ఇళ్లు తిరిగి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్వే పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.



గజ్వేల్‌లో కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి

## తెలంగాణ ప్రధాత సోనియాగాంధీ

**-డిసిసి అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి**

**గజ్వేల్, గజ్వేల్ టౌన్, డిసెంబరు 9 (ప్రభాతవార్త):** ప్రజల ఆకాంక్షను నెరవేర్చడానికి రాష్ట్రాన్ని ఏర్పాటుచేసిన తెలంగాణ ప్రధాత సోనియాగాంధీ అని సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. గజ్వేల్ పట్టణంలోని 6వవార్డులో కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్ ఏర్పాటుచేసిన సిమెంట్ బెంచీలను ప్రారంభించి కేక్ కట్ చేయడం జరిగింది. అనంతరం గజ్వేల్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో హమాలీలకు దుస్తులను పంపిణీ చేశారు. ఇందిరా పార్కు చౌరస్తా వద్ద ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్‌చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కోల అభిరాం గార్డెన్‌లో గజ్వేల్ మండల పరిధిలోని గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులను, నూతనం ఎన్నికైన యువజన కాంగ్రెస్ కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తూంకుంట నర్సారెడ్డి మాట్లాడుతూ దశాబ్దాలుగా తెలంగాణ ప్రాంత ప్రజల ఆకాంక్ష అయిన తెలంగాణ రాష్ట్రాన్ని సోనియాగాంధీ ఇచ్చారన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, కార్పోరేషన్ మాజీ చైర్మన్ భూంరెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆంక్షరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు సర్వర్‌పాషా, సీనియర్ నాయకులు నక్క రేగొండ, సుభాష్‌చంద్రబోస్, మతీన్, చింతకింది కృష్ణ, వివిధ మండలాల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

**బండారు శ్రీకాంత్‌రావు ఆధ్వర్యంలో...**

సోనియాగాంధీ జన్మదిన వేడుకలను సోమవారం గజ్వేల్ పట్టణంలో పిసిసి అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని మానసిక వికలాంగుల హాస్టల్‌లో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అంతకుముందు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించడంతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి జన్మదిన కేక్ కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, గోపాల్‌రావు, గజ్వేల్ మండల అధ్యక్షుడు మద్దూరి మల్లారెడ్డి, పిసిసి రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎక్బాల్, గంగిశెట్టి శ్రీనివాస్‌గుప్త, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము విజయ్‌కుమార్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చెట్టిపల్లి అనిల్‌రెడ్డి, మన్నె కృపానందం, నాయకులు భూపాల్‌రెడ్డి, నాయకం శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, ఫణి, బిక్షపతి, కరుణాకర్‌రెడ్డి, క్యాసారం బాబా, నాయకులు శ్రీనివాస్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

**సిద్దిపేటలో...**

**సిద్దిపేట రూరల్, డిసెంబరు 9, ప్రభాతవార్త :** ఏఐసిసి అగ్రనాయకురాలు, ఎంపి, తెలంగాణ ప్రజల అకాంక్ష నెరవేర్చిన సోనియాగాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని గాంధీ చౌక్‌వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇంచార్జి హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు, నాయకులు సాకి అనంద్, బొమ్మల యాదగిరి, గోపికృష్ణ,సతీష్‌గౌడ్, లక్ష్మీ, గయాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

**నంగునూర్‌లో...**

కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను జిల్లా యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని నంగునూర్‌లో కేక్ కట్‌చేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాములు, హరీష్, సోమయ్య, అశోక్, నవీన్,సత్త్వవ్వ, గోపి, సందీప్, నరేష్, శేఖర్, ప్రశాంత్, శ్రీధర్, శివ పాల్గొన్నారు.

**చిన్నకోడూరులో...**

సోనియాగాంధీ జన్మదిన వేడుకలను చిన్నకోడూరు మండల కేంద్రంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి తుమ్మల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మధు,శ్రీనివాస్‌రెడ్డి, మిట్టపల్లి కనకరాజు, మహేష్, వెంకట్, బాబు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం

### యూత్ కాంగ్రెస్‌ను మరింత పటిష్టం చేస్తాం

**సిద్దిపేట అర్బన్, డిసెంబరు 9, ప్రభాతవార్త :** యూత్ కాంగ్రెస్ జిల్లా సెక్రటరీగా సిద్దిపేట పట్టణానికి చెందిన కంచర్ల సాయినాథ్‌గౌడ్ నియామకమయ్యారు. అలాగే సిద్దిపేట అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్‌గా మదూరి విజయ మోహన్ నియామకమయ్యారు. సోమవారం యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అంక్షారెడ్డి నియామకం పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సాయినాథ్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి యూత్ కాంగ్రెస్‌ను మరింత పటిష్టం చేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, జిల్లా పార్టీ అధ్యక్షులు నర్సారెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ, నాయకులు గాడిపల్లి శ్రీనివాస్, గూడూరి శ్రీనివాస్, తాడూరి శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, ఎం,డి,ఇమామ్(అత్తు), వంగరి నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు.

### నాటు సారా తయారు చేసినా..విక్రయించినా జైలుకే..

**హుస్నాబాద్ ఎక్సైజ్ ఎస్ఐ దామోదర్**

**అక్కన్నపేట, డిసెంబరు 9, ప్రభాతవార్త :** హుస్నాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నాటు సారా తయారు చేయడం..విక్రయించడం లాంటివి ఎవరు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్ఐ దామోదర్ అన్నారు. ఆదివారం రాత్రి సమయంలో మండలంలోని గండిపల్లి నుండి రామవరం దారిలో స్థానిక సీఐ పవన్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గండిపల్లి పరిధిలోని మేన్యతండాకు చెందిన ముడవత్ కిషన్ అనే వ్యక్తి 10లీటర్ల నాటు సారాతో పట్టుబడ్డారు. సారాను స్వాదీనం చేసుకున్న అధికారులు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఇలాంటి కార్యక్రమాలకు ఎవరు పాల్పడినా..పాల్పడినట్లు తెలిసినా స్థానిక స్టేషన్‌లో సమాచారం అందించాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. తనిఖీలు చేసిన వారిలో ఎస్ఐ దామోదర్‌తో పాటు కానిస్టేబుల్స్ సతీష్, గణేష్, సిబ్బంది ఉన్నారు.



నాటు సారా స్వాధీనం చేసుకుంటున్న ఎస్ఐ దామోదర్

## కారు ఢీకొని మహిళ మృతి

**మరొకరికి తీవ్ర గాయాలు**

**సంగారెడ్డి బ్యూరో, డిసెంబరు 9 ప్రభాతవార్త:** పొలానికి పనుల నిమిత్తం నడుచుకుంటూ వెళ్తున్న దంపతులను వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో భార్య అక్కడికక్కడే మృతి చెందగా, భర్తకు తీవ్ర గాయాలైన సంఘటన నార్సింగి మండలకేంద్రంలో సోమవారం జరిగింది. నార్సింగి ఎస్ఐ అహ్మద్ మోహినుద్దీన్ కథనం ప్రకారం... నార్సింగికి చెందిన వట్టపు లక్ష్మీ(40) భర్త నాగరాజుతో కలిసి నార్సింగి శివారులో ఉన్న వ్యవసాయ పొలానికి నడుచుకుంటూ వెళ్తున్నారు. హైదరాబాదు నుండి నిజామాబాద్ వెళ్తున్న కారు అతి వేగంగా వచ్చి నడుచుకుంటూ వెళ్తున్న దంపతులను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వట్టపు లక్ష్మీ అక్కడికక్కడే మృతి చెందగా, భర్త నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు తీవ్రంగా గాయపడిన నాగరాజును ఆసుపత్రికి తరలించారు. నార్సింగి తహసిల్దార్ షేక్ కరీం ప్రమాదం జరిగిన స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం లక్ష్మీ మృతదేహాన్ని రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ల సర్వే నుంచి
## పంచాయతీ కార్యదర్శులకు మినహాయింపు



ఎంపిడిఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

**కంగ్టి, డిసెంబరు 9, ప్రభాతవార్త:** ప్రజాప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తున్నా ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ఇప్పటి వరకు పరిష్కరించలేదని కంగ్టి మండల పంచాయతీ కార్యదర్శులు కంగ్టి ఎంపిడిఓకు వినతిపత్రం అందజేశారు. సోమవారం ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ రేషన్‌కార్డులు, కులగణన, ఆర్థిక సర్వే, ఇందిరమ్మ గృహనిర్మాణ లబ్దిదారుల ఎంపిక మొదలైన వాటి నిర్వహణలను, సన్నాహాలను అధ్యయనాలు చేస్తోంది. ఈ సర్వేలను క్షేత్ర స్థాయిలో ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తూ విజయవంత మైన సేవలు అందిస్తున్న పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభు త్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయ తీల్లోననిధుల సమస్యలతో పాటు తీవ్రమైన పనిభారంతో ఆర్థికంగా మాన సికంగా, కృంగి పోతున్నామన్నారు. గ్రేడ్ 4 పంచాయతీ కార్యదర్శులుగా ఏడాది సేవాకాలం పూర్తయినందున ప్రభావిత తేదీ ఎఫెక్టెడ్ డేట్‌ను డిక్లేర్ చేస్తూ జీఓను విడుదల చేయాలన్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శు లు నాలుగుసంవత్సరాల కాలం పూర్తిచేసుకున్న గ్రేడ్ 4 పంచాయతీ కార్య దర్శులుగా క్రమబద్ధీకరణ పొందిన వారికి సర్వీసుకాలం పరిగణిస్తూ జీఓ జారీ చేయాలన్నారు. క్రీడ కోటాల్లో ఎంపికైన 58మంది పంచాయతీ కార్యదర్శులను తొలగించారు. వారిని వెంటనే విధుల్లోకి తీసుకుని వారి సర్వీసును క్రమబద్ధీకరించాలని వారన్నారు. ఈకార్యక్రమంలో పంచా యతీ క్యార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ తడ్కల్ నూతన కమిటీ ఎన్నిక



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**కంగ్టి, డిసెంబరు 9, ప్రభాతవార్త:** ఎమ్మార్పీఎస్ తడ్కల్ క్లస్టర్ నూతన కమిటీని నారాయణఖేడ్ నియోజకవర్గ కన్వీనర్ అలిగే జీవన్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సోమవారం తడ్కల్ అంబేద్కర్ భవనంలో సమావేశం ఏర్పాటుచేసి నూతనకార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. తడ్కల్ క్లస్టర్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షునిగా లాల్‌కుమార్ మాదిగను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా బాన్సువాడ సాయిలు మాదిగ, ఎర్రోళ్ల అంజయ్య మాదిగ, ప్రధానకారదర్శిగా లింగోల యాదయ్య మాదిగ, కార్యదర్శులుగా చిలక గంగారాం, భాస్కర్, మనోహర్, ఏసన్నలను నియ మించారు. ఎమ్మార్పీఎస్ కమిటీ సభ్యులుగా విజయ్, సాయిలు, రాజు, నవీన్‌కుమార్, శరణప్ప, యాదయ్యలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కన్వీనర్ జీవన్‌కుమార్ మాదిగ మాట్లాడుతూ అన్ని మండ లాల పరిధిలోని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ కమిటీలను వేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చౌటకూరులో సోనియా గాంధీ జన్మదిన వేడుకలు



సోనియా గాంధీ జన్మదినాన్ని జరుపుకుంటున్న కాంగ్రెస్ నేతలు

**చౌటకూరు. డిసెంబరు 9, ప్రభాతవార్త:** ఏఐసిసి మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను మండల కేంద్రమైన చౌటకూరులో ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నత్తి దశరథ్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బర్త్ డే కేక్‌ను కట్ చేసి నోటిని తీపి చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షులు రామాగౌడ్, ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు రామస్వామి, ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షులు మనోజ్, చౌటకూరు గ్రామ పార్టీ ఉపాధ్యక్షులు ఆబేద్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి ఆగమయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రవీందర్, బిసి సెల్ అధ్యక్షులు కృష్ణ, నాయకులు గోవర్ధన్, ఈశ్వర్‌గౌడ్, ఫిరోజ్, మల్లికార్జున్‌గౌడ్, రాఘునాయక్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన వైస్‌చైర్మన్



రోడ్డునిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ దారం శంకర్

**నారాయణఖేడ్ టౌన్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలోని కరస్‌గుత్తి రోడ్డు నుంచి కంగ్టి రోడ్డు నిర్మాణ పనులను సోమవారం మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ ఆనంద్ స్వరూప్ శెట్కార్, దారం శంకర్ పరిశీలించారు. ఇటీవల ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాలు చేపట్టి రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టిన విషయం పాఠకులకు విదితమే. ఈ సంద ర్భంగా వైస్‌చైర్మన్ దారం శంకర్ మాట్లాడుతూ వ్యవసాయ పొలాలకు రోడ్డు సౌకర్యం లేక రైతులు పడుతున్న పాట్లను పరిష్కరించేందుకు 3కిలో మీటర్ల రోడ్డును నిర్మిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణం పనులు పూర్తయితే రైతులతో పాటు ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని చైర్మన్, వైస్‌చైర్మన్‌లు పేర్కొన్నారు.

## నేటి నుంచి సిఎం కప్ పోటీలు

**పాపన్నపేట, డిసెంబరు 9, ప్రభాతవార్త:**
ఈ నెల 10వ తారీఖు నుంచి 12వ తేదీ వరకు మండల కేంద్రమైన పాపన్నపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సిఎం కప్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ విష్ణువర్ధన్ తెలిపారు. సిఎం కప్ పోటీల్లో కబడ్డీ, ఫూట్‌బాల్, కోకో, యోగాతో పాటు వివిధ అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయన్నారు. మొదటిరోజు 10వ తారీఖున వాలీబాల్, 11న కబడ్డీ, 12న కోకో పోటీలు నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు పిడిలు నరేష్‌కుమార్, రమేష్‌లను 6281350097/9010735121లను సంప్రదించాలన్నారు.

# సమస్యల పరిష్కారానికి ప్రజావాణి
## రామాయంపేట తహసీల్దార్ రజిని కుమారి



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహశీల్దార్ రజిని కుమారి

**రామాయంపేట మున్సిపాలిటీ, డిసెంబరు 9, ప్రభాతవార్త:** ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవాలని, సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రామాయంపేట తహశీల్దార్ రజిని కుమారి సూచించారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రజినికుమారి మాట్లాడుతూ రామాయంపేట మండలవ్యాప్తంగా ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా నేడు ప్రజా సమస్యలకు సంబంధించి పలు దరఖాస్తులు వచ్చా యని ఆమె తెలిపారు. ప్రతి సోమవారం జిల్లా కలె క్టర్ ఆదేశాల మేరకు ఉదయం 10 గంటలనుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు నేరుగా ప్రజావాణిలో దరఖాస్తు చేసుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్.ఐ. గౌసొద్దిన్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

## శాస్త్రీయదృక్పథం పెంపొందడానికి టాలెంట్ పరీక్షలు



జడ్పీహెచ్‌ఎస్‌లో బయోసైన్స్ టాలెంట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

**పాపన్నపేట, డిసెంబరు 9, ప్రభాతవార్త:**
విద్యార్థుల్లో దాగి ఉన్న శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి జీవశాస్త్ర టాలెంట్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలంగాణ బయోసైన్స్ ఫోరం మండల అధ్యక్షులు బేజుగం వేణుగోపాల్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన పాపన్నపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని ఆయా పాఠశాలల చెందిన 32 మంది విద్యార్థులకు బయో సైన్స్ టాలెంట్ టెస్టులు నిర్వహించారు. టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చాటిన ఇద్దరు విద్యార్థులను జిల్లాస్థాయి టెస్టులకు పంపుతామని బేజుగం వేణు గోపాల్ పేర్కొన్నారు. టాలెంట్ టెస్టులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్ ఆధ్వర్యంలో కొనసాగాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నసీరుద్దీన్, కరుణాకర్, నాయుడు, శివశంకర్, శ్రవణ్ కుమార్, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

### అసెంబ్లీ ముట్టడికి బయలెక్కిన
## మాజీ సర్పంచ్‌ల అరెస్టు



అసెంబ్లీ ముట్టడికి బయలెక్కిన మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేసిన పోలీసులు

**జహీరాబాద్, డిసెంబరు 9, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల జెఎసి పిలుపు మేరకు పెండింగ్ బిల్లుల కొరకు సోమవారం బిఆర్ఎస్ మండల అధ్యక్షులు తట్టు నారాయణ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి బయలెక్కిన మాజీ సర్పంచ్‌లను పోలీసులు అరెస్టు చేసి పోలీసు ఠాణాకు తరలించారు. అరెస్టు అయిన వారిలో శేఖాపూర్, మల్చెల్మా తండా, రాయిపల్లి(డి), బూర్దిపాడ్ గ్రామాల మాజీ సర్పంచ్‌లు చిన్నారెడ్డి, చందర్ చవాన్, విజయ్, అబ్రహాంలు ఉన్నారు. గ్రామాల అభివృద్ధికి వడ్డీ లకు అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేపడితే బిల్లులు చెల్లించకుండా, బిల్లు లు అడిగేందుకు వస్తుంటే అరెస్టులు చేయడం ఏమిటని మాజీ సర్పంచ్‌లు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమకు రావాల్సిన బిల్లు లను వెంటనే అందేలా చూడాలని మాజీ సర్పంచ్‌లు డిమాండ్ చేశారు.

## దత్తాత్రేయస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

**హత్నూర, డిసెంబరు 9, ప్రభాతవార్త:**
హత్నూర మండలం మాదుర గ్రామం పరిధిలోని దత్తాత్రేయస్వామి వారి జయంతి ఉత్సవాలకు ఏర్పాటు పూర్తిచేసినట్లు నిర్వాహకులు, క్షేత్రాధిపతి సభాపతిశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7నుండి 16వ తేదీ వరకు జయంతి ఉత్సవాలు జరుగుతాయని, ఉత్సవాలకు ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుండి కూడా భక్తులు అధికసంఖ్యలో హాజరవుతారన్నారు. సంగీత, నాట్య ప్రదర్శనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, జాతర, వ్రతములు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

## సిద్ధివినాయకుడిని దర్శించుకున్న ఎంపి దంపతులు

**న్యాల్‌కల్, డిసెంబరు 9, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులోని స్వయంభూవుగా వెలిసి భక్తులచే నిత్య పూజలు అందుకుంటున్న శ్రీ వరసిద్ధి వినాయకుడిని సోమవారం జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎంపి శెట్కార్ కుటుంబ సభ్యులను ఆలయ అర్చకులు మోహన్ జ్యోషి ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో అలయ ప్రధాన అర్చకులు మోహన్‌రావుజ్యోషి వేద మంత్రాలు వల్లిస్తుండగా ఎంపి శెట్కార్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

**సిర్గాపూర్, డిసెంబరు 9, ప్రభాతవార్త:**
గ్రామ పంచాయతీ పెండింగ్ బిల్లుల కొరకు అసెంబ్లీ ముట్టడికి వెళుతున్న తాజా మాజీ సర్పంచ్‌లను మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో అరెస్టుచేసి పోలీసు ఠాణాకు తరలించారు. ఈ సంద ర్భంగా మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీలలో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వడ్డీలకు అప్పులుచేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టా మని, బిల్లులు అందించకుంటే తమ పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు రావాల్సిన బిల్లులను వెంటనే అందించాలని వారు డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో మాజీ సర్పంచ్‌లు రవి, బసిరెడ్డి, విజయ్, సంజీవరావు, నర్సింహ, నాగభూషణం తదితరులు ఉన్నారు.

## బాలలహక్కుల చట్టాలను పటిష్టంగా అమలుచేయాలి



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న జడ్పీ సిఈఓ

**సంగారెడ్డి బ్యూరో డిసెంబరు 9, ప్రభాతవార్త:**
బాలలహక్కుల చట్టాలను పటి ష్టంగా అమలు చేయాలనీ జిల్లా పరిషత్ సిఈఓ జానకి రెడ్డి అన్నారు. జిల్లా మహిళ, శిశు సంక్షేమశాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో, జిల్లా పరిషత్ కార్యాలయంలో సోమవారం బేటీబచావో బేటీపడావో గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జడ్పీ సిఈఓ మాట్లాడుతూ, బాలల హక్కుల చట్టాలను అమలుచేయడం అత్యంత ప్రాముఖ్యమని, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణ, బాల్య వివాహాల నిరోధం, బాలల అక్రమరవాణా వంటి సమస్యలపై సమాజాన్ని ఇంకా చైతన్యవంతం చేయవలసిన అవసరం ఉందన్నారు. బాలబాలికల సమాన హక్కులపై అవగాహన కార్యక్రమాల ద్వారా బాలల భవిష్యత్తును కాపాడవలసిన అవసరం ఉందన్నారు. సమాజంలో వారి భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్లను విస్తృతంగా ప్రచారం కల్పించాలని అన్నారు. ప్రజలకు సమస్యలు ఎదురైనప్పుడు, అందుకు సంబంధిత సహాయం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సిఈఓ శ్రీమతి ఆర్.స్వప్న, జిల్లా మహిళాసాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి, సూర్య కాంత్, నరసింహా రెడ్డి, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్ అడ్మిషన్ తేదీ పొడిగింపు




సిర్గాపూర్ స్టడీ సెంటర్‌లో ఓపెన్ స్కూల్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**సిర్గాపూర్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** బడి మానేసిన వారికి ఓపెన్ స్కూల్ ఒక వరం లాంటిదని ఓపెన్‌స్కూల్ కో-ఆర్డినేటర్ వెంకటస్వామి అన్నారు. ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్‌లు పొందేందుకు తేదీని పొడిగించినట్లు పేర్కొన్నా రు. మండలకేంద్రమైన సిర్గాపూర్‌లోని స్టడీసెంటర్‌లో ఏర్పాటుచేసిన కార్యక్ర మంలో ఓపెన్ స్కూల్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ వెంకటస్వామి మాట్లాడుతూ ఈనెల 11వ తారీఖు వరకు ఓపెన్‌స్కూల్‌లో అడ్మిషన్‌లు పొందవచ్చన్నారు. ఇంటర్‌లో అడ్మిషన్ చేసుకు న్నవారు ఇంటర్మీడియట్‌లో హెచ్ఈసి, సిఈసి గ్రూపులలో అడ్మిషన్‌లు పొందవచ్చని సెంటర్ కో-ఆర్డినేటర్ నాగారం శ్రీనివాస్ పేర్కొన్నారు. అడ్మిషన్‌లు పొందేందుకు 9177293618ను సంప్రతించాలని పేర్కొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**రామాయంపేట, డిసెంబరు 9, ప్రభాతవార్త:** రామాయంపేట మున్సి పల్ పరిధిలోని ఆరవ వార్డుకు సంబంధించిన కె.శిరీష భర్త యాదగిరికి మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు సహకారంతో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును సోమవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు అంద జేశారు. 23 వేల రూపాయల చెక్కును వైద్య ఖర్చుల నిమిత్తం ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ దేమె యాదగిరి, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు చౌదరి సుప్రభాతరావు, రమేష్‌రెడ్డి, చింతల స్వామితో పాటు పలువురు పాల్గొన్నారు.

# అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు



రామాయంపేటలో మాజీ సర్పంచ్‌లను ముందస్తుగా అదుపులోకి తీసుకున్న ఎస్ఐ బాలరాజుగౌడ్

**రామాయంపేట, డిసెంబరు 9, ప్రభాతవార్త:** రామాయంపేట మండల వ్యాప్తంగా తాజా మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తమకు రావలసిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తాజా మాజీ సర్పంచ్‌ల ఫోరం జేఏసీ ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ కారణంగా మాజీ సర్పంచ్‌లు ఎవరు కూడా హైదరాబాద్ నగరానికి బయలుదేకుండా ఉండడం కోసం పోలీసులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. తెల్లవారుజామునుండే తాజా మాజీ సర్పంచ్‌లను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ తాము అప్పులు చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేశామని, బిల్లులు రాకపోవడంతో అప్పులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యమని పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమకు రావలసిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, ఆతర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు నర్సాగౌడ్, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు ఉమామహేశ్వర్, కిషన్ తాండా మాజీ సర్పంచ్ సుభాష్, శివాయిపల్లికి చెందిన ఆర్‌కె.మల్లేశం, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు స్వామి, ధర్మారం తాజా మాజీ సర్పంచ్ శంకర్, దంతేపల్లి సురేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కోనాపూర్ ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందచేసిన నాయకులు

**నారాయణఖేడ్ టౌన్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురికి ఆదివారం నారాయణఖేడ్ పట్టణం లోని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి నివాసగృహంలో డిసిసి ప్రధానకార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు పట్లోళ్ల సుధాకర్ రెడ్డిలు బాధితులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎంపిపి అధ్యక్షులు శంకరయ్యస్వామి, నియోజక వర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గిరిధర్ చౌహాన్, నాయకులు పండరి రెడ్డి, దేవరెడ్డి, పల్లవి, పరశురాం, బస్వరాజ్, మోహన్‌రెడ్డి, అర్జున్, జైరాజ్, నగేష్, పండరి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## హామీలను అమలుచేసిన కాంగ్రెస్

**జహీరాబాద్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** ఎన్నికల సందర్భంగా ప్రజ లకు కాంగ్రెస్ పార్టీ చేసిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిం దని జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎస్వీ కన్వెన్షన్ హాల్‌లో జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన 1100 మందికి 11 కోట్ల రూపాయలకు పైగా మంజూరైన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎంపి సురేష్‌శెట్కార్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావుతో కలిసి పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం 69వేల కోట్ల నుంచి 7 లక్షల కోట్ల అప్పులు చేసి పాలనను కాంగ్రెస్‌కు అప్పగించిందని గుర్తుచేశారు. అప్పుల ఊబిలో రాష్ట్రం కూరుకుపోయినా ప్రజలకు చేసిన హామీలను అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఒకే సంవత్సరంలో 56వేల ఉద్యోగాలు కల్పించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కుతుం దన్నారు. నిమ్జ్ ఏర్పాటుతో పెద్ద పెద్ద కర్మాగారాలు వస్తాయని ఎంపి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, రాష్ట్ర సెట్విన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, ఆర్‌డిఓ పి.రామ్‌రెడ్డి, నియోజక ర్గంలోని ఆయా మండలాల తహసీల్దార్‌లు, ప్రజాప్రతినిధులు, లబ్ది దారులు పాల్గొన్నారు.

## సన్మానం అందుకున్న యూత్ కాంగ్రెస్ నాయకులు



యూత్ కాంగ్రెస్ నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

**మనూర్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికైన నాయకులను ఆదివారం ఘనంగా సన్మానించారు. నారాయణ ఖేడ్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికైన గంపల సిద్ధారెడ్డి (సంగారెడ్డి), మనూర్, నాగల్‌గిద్ద మండలాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన ఆకాష్‌రావు పాటిల్, సచిన్‌లను మండల కేంద్రమైన మనూర్‌లో ఏర్పాటుచేసిన సన్మానసభలో పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నియోజవర్గ అధ్యక్షులు సిద్ధారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల దరికి చేరేలా చూసుకోవాల్సిన బాధ్యత, అవసరం యూత్ కాంగ్రెస్ నాయకులపై ఉందని గుర్తుచేశారు. పార్టీ అభ్యున్నతికి తమవంతు కృషి చేస్తామని కొత్తగా ఎన్నికైన అధ్యక్షులు ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు దిగంబర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, న్యాయ వాది సంగన్న, బిరదర్ దత్తు, శ్రీకాంత్‌రెడ్డి, దత్తుగౌండ, అశోక్‌రావు, పండరినాథరావు, విజయ్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, సత్యనారాయణ, నగేష్, సాయి, నారాయణ, పండరి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు



సోనియా గాంధీ జన్మదినాన్ని జరుపుకుంటున్న కాంగ్రెస్ నేతలు

**నారాయణఖేడ్ టౌన్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** ఏఐసిసి మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను సోమవారం నారా యణఖేడ్ పట్టణంలోని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి నివాసంలో డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన బర్త్‌డే కేక్‌ను కట్ చేసి నోటిని తీపి చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పట్లోళ్ల సుధాకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భోజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ ఆనంద్ స్వరూప్ శెట్కార్, దారం శంకర్ సేట్, మండల అధ్యక్షులు తాహెర్, నాయకులు మాజిద్, మన్మంద్లు, రాజేష్, రామకృష్ణ, వివేకానంద, సద్దాం, పండరిరెడ్డి, ముంతాజ్ సేట్, నాగేష్, పండరినాథ్ పాటిల్, మాణిక్యం, సర్దార్, శంకర్ ముదిరాజ్, కిషన్ నాయక్, మారుతిరావు సంగ్రామ్ నాయక్, శంకర్‌నాయక్, గౌస్ చిస్తి, పవన్, పండరి, సుబర్ సేట్, ఖాన్‌సాబ్, పెరుమాళ గౌడ్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పుల్‌కల్ పిహెచ్‌సికి అంబులెన్స్



నూతన అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న మండల కాంగ్రెస్‌పార్టీ నాయకులు

**పుల్‌కల్, డిసెంబరు 9, ప్రభాతవార్త:**
ఏఐసిసి మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర్ ప్రత్యేక చొరవతో పుల్‌కల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అంబులెన్స్‌ను కేటాయించారు. పిహెచ్‌సికి కేటాయించిన అంబులెన్స్‌ను మండల కాంగ్రెస్ నాయకులు పూజా కార్యక్రమాలు నిర్వ హించి ప్రారంభించారు.

## మాజీ ఎంపిపి ఉపాధ్యక్షుడి ప్రథమ వర్ధంతి

**ఝరాసంగం, డిసెంబరు 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొల్లూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపిపి ఉపాధ్యక్షులు సుధామా పాటిల్ ప్రథమవర్ధంతిని సోమవారం సుధామాపాటిల్ నివాసంలో జరుపుకు న్నారు. సుధామా పాటిల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సుధామాపాటిల్ గ్రామ సర్పంచ్‌గా, ఎంపిటిసి సభ్యులుగా, మాజీ ఎంపిపి ఉపాధ్యక్షులుగా గ్రామానికి, మండలానికి చేసిన సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు హన్మంతరావు పాటిల్, మాజీ జడ్పీటిసి సభ్యులు పండరినాథ్, మల్లికార్జున్ పాటిల్, ప్రహ్లాద్ పాటిల్, సంతోష్ పాటిల్, భోజిరెడ్డి, నవాజ్‌రెడ్డి, శ్రీకాంత్ పాటిల్, ఉమాకాంత్ పాటిల్, సంగ్రామ్ పాటిల్, మలిశెట్టి పాటిల్ తదితరులు పాల్గొన్నారు.